ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కాకినాడ

జిల్లా వార్తలు

శనివారం 28 జూన్ 2025 | 5

4న జేఎన్‌టీయూకే 11వ స్నాతకోత్సవం

అధ్యక్షత.. కులపతి, రాష్ట్రగవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్

ముఖ్య అతిథిగా విద్యాశాఖామంత్రి నారా లోకేశ్ 6

డిగ్రీ అడ్మిషన్లు ఎప్పుడో! 7

ఆన్‌లైనా.. ఆఫ్‌లైన్‌లోనా » ఎటూ తేల్చని ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న నిశాంత్‌కుమార్

సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్‌కుమార్


కాకినాడ క్రైం/కలెక్టరేట్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాను సారా రహితంగా తీర్చిదిద్దాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్‌కుమార్ పేర్కొన్నారు. ఆయన శుక్రవారం డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ రాహుల్‌దేవ్ శర్మతో కలిసి కలెక్టరేట్‌లోని వివేకానంద హాల్లో నవోదయం 2.0 అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సారా తయారీ, అక్రమ రవాణా, విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సారా కేసుల్లో ముద్దాయిలను బైండోవర్‌లు చేయాలన్నారు. ముఖ్యంగా సారా తయారీకి ఉపయోగించే బెల్లం సప్లయ్ చేసే వ్యాపారులపై పటిష్ట నిఘా ఉంచాలన్నారు. అలాగే వ్యాపారులను కూడా బైండోవర్ చేయాలన్నారు. తద్వారా సారాను నియంత్రించేందుకు మార్గం సుగమం అవుతుందన్నారు. గ్రామస్థాయిలో సారా నిర్మూలించేందుకు విస్తృత ప్రచారం చేయాలని ఆదేశించారు. ఇప్పటికే పలు కేసుల్లో ఉన్న ముద్దాయిల ప్రవర్తనను పరిశీలించి వారు ఇప్పటికీ సారా వ్యాపారం చేస్తున్నట్టయితే వారిపై పీడీ యాక్ట్‌లు పెట్టాలని ఆదేశించారు. నవోదయం 2.0 కార్యక్రమం ద్వారా జిల్లాను సారా రహితంగా చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కాకినాడ జిల్లా డిప్యూటీ కమిషనర్ వై.చైతన్యమురళీ, అసిస్టెంట్ కమిషనర్ వి రేణుక, జిల్లా అధికారి ఎం.కృష్ణకుమారి, ఏఈఎస్ కె.మౌనిక, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

నేడు పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి కాకినాడ పర్యటన

కాకినాడ సిటీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలు చేపట్టిన పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి శనివారం కాకినాడలో పర్యటించనున్నారు. ఉదయం 9.30 గంటలకు నగరంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొని ప్రసంగించనున్నారు. జిల్లాలోని పార్టీ స్థితిగతులు, పార్టీ సభ్యత్వ నమోదు తదితర అంశాలపై దిశానిర్దేశం చేయనున్నారు.

జిల్లా సహకార అధికారిగా శ్రీనివాసరెడ్డి

కాకినాడ సిటీ, జూన్27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సహకార శాఖ అధికారిగా బి.శ్రీనివాసరెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఈమేరకు శుక్రవారం రాష్ట్ర వ్యవసాయ సహకారశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం ఈయన స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ రిజిస్ట్రార్ హోదాలో ఉన్నారు.



అవినీతి ఆరంభం : కాకినాడ జిల్లా కొమరగిరిలో జగనన్న ఆరంభించిన లేఅవుట్

నేతలు.. మహా మేతలు!

అతి పెద్ద స్కామ్ ఇక్కడే..

అతిపెద్ద స్కాం కొమరగిరి లేఅవుట్‌లోనే ఉన్నట్టు విజిలెన్స్ నిర్ధారించింది. అప్పట్లో సీఎం జగన్ ఇక్కడి నుంచి పేదల ఇళ్ల పథకం ప్రారంభించడంతో లోతట్టుగా ఉన్న 350 ఎకరాల కొమరగిరి భూములు చదునుకు రూ.125 కోట్ల వరకు వెచ్చించింది. ఈ పనులు అప్పటి కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చేశారు. గ్రావెల్‌ను పోలవరం కాలువలు, పెద్దాపురం రామేశంమెట్ట నుంచి తరలించేశారు. అధికారులేమో అడ్డగోలుగా రూ.35 కోట్ల వరకు బిల్లులు ఇచ్చేశారు. దీనిపై అప్పట్లో ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి రేవు ముత్యాల రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. లేఅవుట్ చదునుకు ఎకరాకు కనీసం రూ.15 లక్షల్లోపు చేయాల్సి ఉన్నా రెట్టింపు బిల్లులు ఇవ్వడంపై అనుమానాలు వ్యక్తం చేసినా చర్యల జోలికి వెళ్లలేదు. విచారణ బృందాలు ఈ అక్రమాలు తవ్వనున్నాయి.

పేదల ముసుగు..పెద్దల లొసుగు

- జగనన్న లేఅవుట్లలో భారీ అవినీతి
- ప్రత్యేక బృందాలతో విచారణ
- అడ్డగోలు చెల్లింపులపై ఆరా
- రూ.70 కోట్లు బిల్లుల పెండింగ్
- వేట ఆరంభించిన ప్రభుత్వం
- లేఅవుట్లలో 80 శాతం అక్రమాలే
- వెలుగు చూస్తున్న వైనం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

నేతలు.. మేతలు.. పేదల ఇళ్ల స్థలాల ముసుగులో గత వైసీపీ ప్రభుత్వంలో కొందరు నేతలు, అధికారులు ఒకటి కాదు రెండు కాదు.. వందల కోట్లు మెక్కేశారు. అంచనాలు అడ్డంగా పెంచేసి.. కోట్లలో బిల్లులు నొక్కేసి ఖజానాకు పంగనామాలు పెట్టారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 1600 లేఅవుట్లలో సుమారు 19 వేల ఇళ్ల స్థలాల కేటాయింపు, ఇతర విషయాలలో అవకతవకలు జరిగినట్టు అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ప్రభుత్వం ఇప్పుడు అవినీతి డొంక కదల్చడానికి నేరుగా రంగంలోకి దిగింది. డ్వామా ఏపీడీలు, రాజధాని నుంచి పంపిన నరేగా క్వాలిటీ కంట్రోల్ అధికారులతో కలిసి ప్రత్యేక బృందాలతో వేట మొదలుపెట్టింది.

కాకినాడలో 324 లేఅవుట్లు..

కాకినాడ జిల్లాలో గత వైసీపీ ప్రభుత్వం 3,84,218 మంది లబ్ధిదారులను ఇళ్ల స్థలాలకు గుర్తించింది. 7,218 ఎకరాలు కావాల్సి ఉండగా 1,856 ఎకరాల ప్రభుత్వ భూమిపోను 5,362 ఎకరాలను రూ.2,566 కోట్లతో రైతుల నుంచి కొనుగోలుచేసింది. 2020 డిసెంబరు 25న అప్పటి సీఎం జగన్ కొమరగిరి వచ్చి తొలిసారిగా ఇళ్ల స్థలాల పథకం ప్రారంభించారు. అలాగే జిల్లావ్యాప్తంగా 324 లేఅవుట్లలో పేదలకు స్థలాలు కేటాయించారు. ప్రభుత్వం మారగానే జగనన్న లేఅవుట్లలో అక్రమాలపై విజిలెన్స్ అధికారులు దృష్టిపెట్టారు. 80 శాతం లేఅవుట్లలో భారీ అవినీతి జరిగిందని నిర్ధారించారు. కాకినాడ జిల్లాలో రూ.321 కోట్ల రెట్టింపు అంచనాలతో 152 లేఅవుట్లలో చేసిన పనులపై విచారణకు ఆదేశించింది. మరో 121 లేఅవుట్లలో పెండింగ్‌లో ఉన్న రూ.42 కోట్ల బిల్లుల అవినీతిపైనా దృష్టి పెట్టింది. 324 లేఅవుట్లలో చదును చేసిన రూ.650 కోట్ల బిల్లుల లెక్క తేల్చబోతోంది.

డొంకంతా కదలాల్సిందే..

విజిలెన్స్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) అధికారులు పంపిన నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రత్యేక బృందాలను నియమించింది. అక్రమాలు భారీగా ఉన్న లేఅవుట్లలో ఎంతమేర నిధులు మెక్కేశారో తేల్చాలని నిర్ణయించింది. విచారణను రెండు భాగాలుగా విభజించింది. తొలి భాగం కింద జరిగిన పనుల పెండింగ్ బిల్లులకు సంబంధించి అక్రమాలపై విచారణ చేపడతారు. ఈ తరహా జిల్లాలో 121 లేఅవుట్లను గుర్తించారు. చదును, రహదారులు, డ్రైన్లు, మంచినీరు తదితర పనులకు రూ.120 కోట్ల వరకు ఇదివరకే చెల్లించగా ఇంకా రూ.42 కోట్లు బాకీలు చూపిస్తున్నారు. ఆయా లేఅవుట్లను తనిఖీ చేస్తున్నారు. రెండో అవినీతి కింద అనేక లేఅవుట్లలో అవసరం లేకున్నా ఒక్కో లేఅవుట్‌లో రూ.5 నుంచి రూ.10 కోట్ల వరకు కాకిలెక్కలతో బిల్లులు చేసుకుని డబ్బులు కాజేశారు. జిల్లాలో 17 మండలాల్లో 152 లేఅవుట్లకు రూ.321 కోట్ల వరకు వ్యయ అంచనాలు చూపించారు. ఎకరాకు రూ.25 లక్షలకుపైగా చదును బిల్లులు చూపించి కోట్లలో డబ్బులు కొట్టేశారు. ఒక్క కాకినాడ జిల్లాలోనే 324 లేఅవుట్లలో చదునుకు సంబంధించి రూ.650 కోట్ల వరకు బిల్లులు అప్పట్లో చెల్లించగా ఇందులో రూ.220 కోట్ల వరకు తప్పుడు బిల్లులే ఉన్నట్టు ప్రభుత్వం అనుమానిస్తోంది.

తూర్పున మెక్కేశారు!

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

తూర్పుగోదావరి జిల్లాలోనూ పేదల ఇళ్ల స్థలాల పేరుతో కోట్లలో మెక్కేశారు. అవినీతి లెక్కతేల్చడానికి రాజమండ్రి రీజియన్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ స్నేహిత ఆధ్వర్యంలో అధికారులు రంగంలోకి దిగారు. ఈ మేరకు 4 బృందాలు ఏర్పాటుచేశారు. 324 లేఅవుట్లకు సంబంధించి రూ.6.6 కోట్లు అవకతవకలు జరిగినట్టు నిర్ధారించారు. రెట్టింపు అంచనాలకు సంబంధించి 7 మండలాల్లో 22 కోట్లు అవకతవకలు జరిగినట్టు తేల్చారు. లోతట్టు ప్రాంతాల్లో నిబంధనల మేరకు ఫిల్లింగ్ చేయకుండా వదిలేసిన కొన్ని ఇళ్లను గుర్తించారు. ఇళ్ల స్థలాల కోసం కొనుగోలు చేసిన భూముల్లో జరిగిన అవకతవకలపై విచారణ చేస్తున్నారు. కోరుకొండ మండలం బూరుగుపూడి, మధురపూడి తదితర ప్రాంతాల్లో పనికిరాని ఆవ భూములకు ఎకరానికి రూ.43 లక్షల వంతున చెల్లించి అవకతవకలకు పాల్పడిన సంగతి తెలిసిందే. దీనిపైనా విచారణ జరుగుతోంది. ఆవ భూమిలో సుమారు 6 మీటర్ల లోతు వరకూ నీరు నిలిచిపోతుందని.. ఇది నివాస యోగ్యం కాదని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. అసలు రైతుకు ఎంత ఇచ్చారు. అప్పట్లో అక్కడ మార్కెట్ విలువ ఎంత? ఎంత ఎక్కువ చెల్లించారు. ఎవరెవరి ప్రమేయం ఇందులో ఉందనే తదితర అంశాలపై నిశితంగా విజిలెన్స్ అధికారులు ఆరా తీస్తున్నారు. త్వరలో అవకతవకల నిగ్గుతేల్చి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు.

కోనసీమలోనూ..కుమ్మేడే

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వంలో పేదలకు ఇళ్ల నిర్మాణం పేరుతో వేసిన లేఅవుట్లలో ఫిల్లింగ్ అక్రమాలపై ప్రభుత్వం విచారణ చేపట్టింది. జిల్లాలోని నీటి యాజమాన్య సంస్థకు చెందిన ముగ్గురు ఏపీడీలు, అమరావతి నుంచి వచ్చే నరేగా క్వాలిటీ కంట్రోల్ టీమ్ సభ్యులతో మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా 111 లేఅవుట్లలో 241 పనులకు సంబంధించి రూ.21 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్టు సమాచారం. వీటితోపాటు గతంలో చేసిన, చేయని పనులకు కూడా భారీగా నిధులు డ్రా చేశారనే ఆరోపణలున్నాయి. ఈ మేరకు టీడీపీ కూటమి ప్రభుత్వం పెండింగ్ బిల్లులకు సంబంధించిన పనులను పర్యవేక్షించేందుకు క్వాలిటీ కంట్రోల్ టీమ్‌లు రంగంలోకి దింపింది. ఈ టీమ్‌లు గత ప్రభుత్వ హయాంలో జరిగిన పనులను పరిశీలించి ప్రభుత్వానికి నివేదికలు ఇవ్వనున్నాయి. పెండింగ్ బిల్లులతోపాటు గతంలో కాలనీల్లో జరిగిన అక్రమాలపై ఈ బృందం విచారణ జరుపుతున్నట్టు సమాచారం.



పిఠాపురం పట్టణంలోని ఉప్పాడ రైల్వేగేటు

భారీగా పెరిగిన పిఠాపురం ఆర్వోబీ అంచనాలు

నిర్లక్ష్యం, అలసత్వం ఖరీదు

రూ.82 కోట్లు

- రూ.12 కోట్లు నుంచి 59.70 కోట్లకు నిర్మాణ వ్యయం
- రూ. 71.55 కోట్లకు పెరిగిన భూసేకరణ వ్యయం

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

నిర్లక్ష్యం ఖరీదు అక్షరాల రూ.82కోట్లు. తొలుత నిధులు మంజూరు చేసిన వెంటనే పనులు చేసి ఉంటే అతి తక్కువ నిధులతో పనులు పూర్తి కావడంతోపాటు ప్రజలు ఇబ్బందులు తీరేవి. నాటి ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం, అధికారులు చూపిన ఆలసత్వం, ఆపై ప్రభుత్వాల నిర్లిప్తతతో నిర్మాణ వ్యయం పెరిగిపోయింది. పిఠాపురం పట్టణం నుంచి ఉప్పాడకు వెళ్లే మార్గంలోని ఉప్పాడ రైల్వేగేటు (రైల్వే క్రాసింగ్ నెంబరు 431) ద్వారా నిత్యం భారీగా వాహనాలు తిరుగుతూ ఉంటాయి. ఇక్కడ ఆర్వోబీ (రైల్వే ఓవర్ బ్రిడ్జి) నిర్మించాలని సుదీర్ఘకాలంగా ఈ గేటు ద్వారా రాకపోకలు సాగించే పిఠాపురం పట్టణ ప్రజలు, రైతులతోపాటు సుమారు 20 గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఇక ఉప్పాడ రైల్వేగేటు మీదుగా నిత్యం 71 రైళ్లు రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. వీటికి గూడ్స్ రైళ్లు అదనం. దీంతో రైల్వేగేటును తరచూ మూసివేస్తున్నారు. ఫలితంగా పాఠశాలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, వివిధ పనులు నిమిత్తం వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్‌జామ్‌లతో వారు ప్రత్యక్ష నరకాన్ని చవిచూస్తున్నారు. దీంతో ద్విచక్ర వాహనదారులు, కార్లు, ఆటోలు ప్రత్యామ్నాయంగా గోర్స రైల్వే ఆర్‌వోబీ ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు. ఉప్పాడ రైల్వేగేటు వద్ద ఆర్వోబీ నిర్మించాలన్న మూడు దశాబ్దాల కలను తాను నెరవేరుస్తానని ఎన్నికలకు ముందు, తర్వాత డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పిఠాపురంలో నిర్వహించిన సభలో ప్రకటించారు. అనుకున్నట్టుగానే ఉప్పాడ రైల్వే గేటు వద్ద ఆర్వోబీ నిర్మాణానికి రూ.59.70కోట్లు మంజూరు చేయించారు. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదం తెలపడం, అప్పటికే భూసేకరణకు ప్రత్యేకంగా నిధులు మంజూరుకావడంతో పనులు ప్రారంభమవుతాయని అందరు ఆశించారు. అయితే పెరిగిన వ్యయాలతో మరలా రెడ్‌సిగ్నల్ పడినట్టయింది. నిజానికి ఉప్పాడ రైల్వేగేటు వద్ద ఆర్వోబీ నిర్మాణానికి తొలి నుంచి అవాంతరాలే. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో తొలుత ఆర్వోబీ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.12కోట్లు మంజూరు చేసింది. ఈలోగా అంచనాలు రూ.27 కోట్లకు పెరిగి పెండింగ్‌లో పడింది. 2019-24 మధ్య వైసీపీ ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వం భూసేకరణ వ్యయాన్ని పూర్తిగా భరించేందుకు ముందుకు వచ్చినా వైసీపీ ప్రభుత్వం వినియోగించుకోలేకపోయింది. అప్పట్లో ఆర్వోబీ నిర్మాణానికి రూ.35కోట్లు మంజూరుచేయగా, రాష్ట్రప్రభుత్వం నిర్లిప్త వైఖరితో అంచనాలు రూ.42 కోట్లకు పెరిగాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రత్యేక చొరవ తీసుకుని కేంద్ర రైల్వేశాఖా మంత్రి అశ్వినివైష్ణవ్, సీఎం చంద్రబాబుతో ఆర్వోబీ విషయంపై ప్రత్యేకంగా చర్చలు జరిపారు. దీంతో ప్రస్తుత రేట్లును పరిగణలోకి తీసుకుని నిర్మాణానికి రూ.59.70కోట్లు కేటాయించారు. అదే సమయంలో భూసేకరణ నిమిత్తం రూ.37కోట్లు అవసరమని తొలుత గుర్తించారు. 700 మీటర్ల పొడవునా ఆర్వోబీ నిర్మాణానికి ఆరు ఎకరాలు అవసరమని, ఇందులో 3.86 ఎకరాల విస్తీర్ణంలోని పొలాలు, నివాస స్థలాలు, భవనాలు తీసుకోవాల్సి ఉంటుందని, ఇందుకుగానూ 40 మందికి పరిహారం చెల్లించాల్సి ఉంటుందని నివేదికలు రూపొందించారు. భూసేకరణకు ఆలస్యం కావడం, స్థలాల రేట్లు పెరిగిపోవడంతో భూసేకరణ వ్యయం రెట్టింపైంది. పెరిగిన మార్కెట్ విలువల ఆధారంగా ఇప్పుడు భూసేకరణకు రూ.71.55 కోట్లు వ్యయమవుతుందని అధికారులు అంచనా వేశారు. పెరిగిన భూసేకరణ వ్యయాన్ని మంజూరు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్ ప్రభుత్వానికి నివేదించారు. ప్రభుత్వాల నిర్లిప్తత కారణంగా ఆర్వోబీ నిర్మాణ వ్యయం రూ.12 కోట్ల నుంచి 59.70కోట్లకు, భూసేకరణ వ్యయం రూ.37 కోట్ల నుంచి రూ.71.55కోట్లకు పెరిగింది. ఇప్పుడు అదనంగా రూ.82.55 కోట్లు వ్యయం చేయాలి. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రత్యేకంగా చొరవ తీసుకుంటేనే భూసేకరణకు నిధులు మంజూరై నిర్మాణం పట్టాలెక్కే పరిస్థితి ఉంది.



వైసీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ

ప్రభుత్వం మెడలు వంచి వాగ్దానాలు అమలుచేయించాలి

విస్తృత స్థాయి సమావేశంలో వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ బొత్స

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, ప్రభుత్వం మెడలు వంచి వాగ్దానాలు అమలు చేయించాలని వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్ ఎమ్మెల్సీ, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. కాకినాడ సూర్య కళామందిరంలో వైసీపీ కాకినాడ జిల్లా విస్తృతస్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, వైసీపీ ఇన్‌చార్జిలు ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, తోట నరసింహం, కురసాల కన్నబాబు, వంగా గీత, ముద్రగడ గిరి, జ్యోతుల చంటిబాబు, దవులూరి దొరబాబు పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకుని ఏదో సాధించారని సంబరాలు చేసుకున్నారని, ఏడాది పాలనలో ఎన్నికల్లో ఇచ్చిన ఏ హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోతున్నారన్నారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్‌ను ఫోన్‌లో స్కాన్ చేస్తే టీడీపీ ప్రజాగళం పేరుతో మేనిఫెస్టో వస్తుందన్నారు. ఏడాదికాలంగా ఏమి చేశారని అడిగితే వారికి అసహనం పెరిగిపోతోందన్నారు. షణ్ముక వ్యూహం పేరుతో కూటమి పార్టీలు మరికొన్ని హామీలు ఇచ్చాయని వాటిని కూడా ప్రజల్లోకి తీసుకుని వెళ్లి కూటమి ప్రభుత్వం మెడలు వంచి వాటిని అమలు చేసేవిధంగా ఉద్యమిస్తామన్నారు. నాయకులు సుంకర విద్యాసాగర్, సుంకర శివప్రసన్న, రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, రాగిరెడ్డి బన్ని, అల్లి రాజబాబు, అజ్జు, పవన్ పాల్గొన్నారు.

ఆ అక్రమాల 'సంఘ'తేంటి?

- కాకినాడలో 'మెప్మా' రుణాల మాయాజాలంపై ప్రభుత్వం ఆరా
- అవినీతి బాగోతంపై ఏ చర్యలు తీసుకున్నారో తెలపాలని ఆదేశం
- పూర్తి నివేదిక అందజేయాలని మెప్మా పీడీకి ఉత్తర్వులు
- గత వైసీపీ ప్రభుత్వంలో రెచ్చిపోయిన రిసోర్స్‌పర్సన్లు
- ఇష్టానుసారంగా గ్రూపుల ఏర్పాటు
- బోగస్ పత్రాలు, సంతకాలతో బ్యాంకులకు టోకరా

గత వైసీపీ సర్కారు హయాంలో మహిళా స్వయం సహాయక సంఘాల రుణాల్లో పెద్దఎత్తున గోల్‌మాల్ జరిగింది. అప్పటి వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, వారి అనుచరులు ఇలా ఎవరికి వారు ఇష్టానుసారంగా చెలరేగిపోయారు. కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలోని మెప్మా విభాగంలో కొందరు ఆర్పీలు రుణాల పేరుతో చేసిన మోసాలు అన్నీ, ఇన్నీ కావు. అమాయకుల ఆధార్‌కార్డులు, అధికారుల బోగస్ సంతకాలతో కోట్లాది రూపాయలు కొట్టేశారు. ఇందులో రిసోర్స్‌పర్సన్లతోపాటు, మెప్మా, బ్యాంకు అధికారులు అందరూ పాలు పంచుకున్నారు. ఈ అవకతవకలపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. ఈ అవినీతి బాగోతాన్ని వివరిస్తూ 'రి'చోర్స్'పర్సన్ల.. 'గూపు'పురాణీ' అంటూ మే 24న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది.

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

కాకినాడలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో పనిచేసే ఆర్పీలు కొందరు అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసి మహిళా స్వయం సహాయక సంఘాల పేరుతో బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నారు. కాకినాడ 10, 6 డివిజన్లకు చెందిన ఇద్దరు అలాగే 36వ డివిజన్ వార్ఫురోడ్డు ఏరియా, రామారావుపేట శివాలయం పరిసర ప్రాంతానికి చెందిన ఆర్పీలు ఇలా కొందరు కోట్లాది రూపాయలను కొల్లగొట్టారు. కొందరి మహిళల ఆధార్‌కార్డులతో గ్రూపులు క్రియేట్ చేసి, వారిని బ్యాంకులకు, మెప్మా అధికారులకు చూపించి లోన్లు పొందారు. అయితే అప్పటికే కొన్ని గ్రూపులకు రుణాలు మంజూరు చేసిన బ్యాంకు అధికారులు చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా బ్యాంకు అధికారులు.. ఆ రుణాలకు సంబంధించిన దరఖాస్తులను పరిశీలించడం, ఫోర్జరీ సంతకాలతో కవరింగ్ లెటర్లను తీసుకొచ్చారని గుర్తించి మెప్మా అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఈ మాయాజాలం వెలుగులోకి వచ్చింది. బోగస్ సంతకాలతో బ్యాంకును బురిడీ కొట్టాలని చూసిన ఆర్పీలు దుర్గ, సత్యవతి, నందిని, శ్రీదేవి లాగిన్‌లను హోల్డ్‌లో పెట్టారు. రుణాల పేరుతో వైసీపీ హయాంలో అక్ర మాలకు పాల్పడిన ఆర్పీల బాగోతం బయటపడుతోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆర్పీ(రిసోర్స్‌పర్సన్లు)లు విచ్చలవిడిగా గ్రూపులను క్రియేట్ చేశారు. మళ్లీ వైసీపీయే తిరిగి అధికారంలోకి వస్తుందని, మహిళా సంఘాల రుణాలు మాఫీ అయిపోతాయని అందరూ భావించారు. ఈ నేపథ్యంలోనే ఆర్పీలు భారీ స్కెచ్ వేశారు. ఎక్కడెక్కడి వారివో ఆధార్‌కార్డులు సేకరించి ఎడాపెడా రుణాలు తీసేసుకున్నారు. చాలా ఏళ్ల బట్టి ఆర్పీలుగా పని చేసిన అనుభవం ఉండడం, బ్యాంకర్లతో సత్సంబంధాలు కలిగి ఉండడంతో వీరికి రుణాల సులువుగా మంజూరయ్యాయి. పదిమంది మనుషులు, పది ఆధార్ కార్డులు కనిపిస్తే చాలు.. రుణాలు లభించేశాయి. ఇక బ్యాంకర్లు కూడా ఆర్పీలు తీసుకొచ్చిన గ్రూపులకు లక్షలాది రూపాయల రుణాలు మంజూరు చేసేశారు. ఈ రుణాల మాయాజాలంలో అప్పటి వైసీపీ ప్రజాప్రతినిధులు కూడా ఈ రుణాల పేరుతో కోట్లాది రూపాయలను వెనకేసుకున్నారు. స్థానిక 36వ డివిజన్‌లో ఓ ఆర్పీ కాకినాడ రూరల్లోని నాలుగు బ్యాంకులకు టోకరా వేసింది. అలాగే కాకినాడ సిటీలోని పలు బ్యాంకుల్లోనూ చక్రం తిప్పింది. ఆయా బ్యాంకుల్లో బోగస్ సంతకాలు, ఆధార్‌కార్డులతో రూ.నాలుగు కోట్ల మేర కొల్లగొట్టింది. అంతేకాదు కొంతమంది మహిళలకు రుణాల పేరుతో ఆశచూపించి.. బ్యాంకుల వెంట తిప్పారు. తీరా డబ్బులు అందాక.. గ్రూపు ప్రెసిడెంట్, సెక్రటరీలు, బ్యాంకర్లు, ఆర్పీలు కుమ్మక్కై.. ఆ మహిళలకు సొమ్ములు ఇవ్వకుండా కొట్టేశారు. ఉదాహరణకు రూ.మూడు లక్షలు రుణం తీసుకున్న వారికి రూ.పది వేలు ఇచ్చి, మిగిలిన రూ.2.90 లక్షలను ఆర్పీలు, అధికారులు, బ్యాంకర్లు పంచుకున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే.. కచ్చితంగా రుణమాఫీ జరుగుతుందని భావించిన ఆర్పీలు భావించగా.. అనుకున్నదొక్కటి.. జరిగింది మరొక్కటి అయింది. గత ప్రభుత్వంలో ఇచ్చిన రుణాలు చెల్లించక ఎన్‌పీఏలుగా మారడంతో బ్యాంకు అధికారులు ఆధార్‌కార్డుల ఆధారంగా మహిళలకు నోటీసులు పంపారు. నోటీసులు అందుకున్న వారందరూ సంఘ ప్రెసిడెంట్, సెక్రటరీ, ఆర్పీలను నిలదీయడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

నామమాత్రపు చర్యలు

కాకినాడ రుణాల మాయాజాలంలో చేతివాటం ప్రదర్శించిన ఆర్పీలపై మెప్మా అధికారులు చేపట్టిన చర్యలపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కోట్లాది రూపాయలు స్కాం చేసిన ఆర్పీల లాగిన్‌లను హోల్డ్‌లో పెట్టి చేతులు దులుపుకొన్నారు.

ఏం జరిగిందో తెలియాలి..

మహిళా స్వయం సహాయక సంఘాల పేరుతో జరిగిన అవకతవకలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది.2019-2024 మధ్యకాలంలో అంటే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రుణాల మంజూరుకు సంబంధించి జరిగిన అవకతవకలపై ఆరా తీసింది. కాకినాడ నగరంతోపాటు రాష్ట్రంలోని ఒంగోలు, అనకాపల్లి, జగ్గయ్యపేట, గుడివాడ వంటి ప్రాంతాల్లో జరిగిన అవినీతి బాగోతానికి సంబంధించిన వివరాలు, వాటికి సంబంధించి తీసుకున్న చర్యలపై వెంటనే నివేదిక ఇవ్వాలని మెప్మా పీడీలను కోరుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.


కాకినాడలోని ఓ మినీ థియేటర్

నగరాల్లో కొత్త ట్రెండ్ నడుస్తోంది. ఒకప్పుడు పెద్ద పెద్ద ఫంక్షన్ హాళ్లలో జరిగే పలు వేడుకలు నేడు మినీ థియేటర్లలో జరిగిపోతున్నాయి. అతి కొద్దిమంది కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులను ఆహ్వానించి సింపుల్‌గా కానిచ్చేస్తున్నారు. అందుకోసం మినీ థియేటర్లను ఆశ్రయిస్తున్నారు. ఖర్చులు తగ్గించుకునే పనిలో పడ్డారు.

ఆనందం

'మినీ'మమ్ గ్యారంటీ...

- నగరాల్లో 'నయా' ట్రెండ్
- పెద్ద పెద్ద ఫంక్షన్ హాళ్లకు కాస్త బ్రేక్
- మినీ థియేటర్లను ఆశ్రయిస్తున్న జనం
- తక్కువ ఖర్చు, అదనపు సౌకర్యాలు
- ఇవే వీటి ప్రత్యేకత

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

నగరాలు, పట్టణాల్లో నివసిస్తున్న వారికి జన్మదినాలు, వివాహ వార్షికోత్సవాలు, ఇతరత్రా పార్టీలు జరుపుకోవాలన్న కోరిక ఎక్కువగా ఉంటుంది. ఫంక్షన్ హాలు బుక్ చేసుకుని అతిథులను పిలిచి చేసుకోవాలంటే ఖర్చు తడిసిమోపెడవుతుంది. ఒకవేళ రెస్టారెంట్‌కు వెళ్లినా అక్కడ డైనింగ్ టేబుల్‌పై కేవలం కేక్ కటింగ్‌కు మాత్రమే అనుమతిస్తారు. ఇంట్లో చేసుకోవాలంటే డెకరేషన్‌కు చాలా ఖర్చవుతుంది. ఈ గ్యాప్‌ను కవర్ చేసేందుకు కాకినాడ నగరంలో కొంత మంది మినీ థియేటర్స్ అందుబాటులోకి తీసుకొచ్చారు. నగరంలో పలుచోట్ల వీటిని ఏర్పాటుచేసి అద్దెకు ఇస్తున్నారు. పుట్టినరోజు వేడుకలు, వివాహ వార్షికోత్సవాలు, ఫ్రెండ్స్, కుటుంబ సభ్యులతో సరదాగా కాసేపు ఎంజాయ్ చేసే కార్యక్రమాలకు వీటిని ఇస్తున్నారు. రూ.3వేలు ఖర్చు చేస్తే సరిపోతుంది. నలుగురు సభ్యులకు రూ.2,500, ఆ తర్వాత ప్రతి అదనపు కుటుంబసభ్యుడికి రూ.250 చెప్పున చార్జ్ చేస్తారు. కాకినాడలోని మెయిన్‌రోడ్డు, జగన్నాథపురం, సినిమారోడ్డు, జేఎన్టీయూకే ఎదురుగా ఉన్న వీధి... ఇలా పలుచోట్ల ఈ మినీ థియేటర్లను ఏర్పాటు చేశారు. చిన్నచిన్న పార్టీలు, ఫంక్షన్ల నిర్వహణకు ఇవి సిద్ధంగా ఉన్నాయి.

అడ్వాన్స్ బుకింగ్ చేసుకునేలా..

ఈ మినీ థియేటర్లను అడ్వాన్స్ బుకింగ్ చేసుకోవచ్చు. కోరుకున్న ఫుడ్ ఐటెంలను తయారు చేసుకుని తీసుకువెళ్లవచ్చు. ఫుడ్ డెలివరీ సంస్థలకు ఆర్డర్లు పెట్టుకోవచ్చు. మినీ థియేటర్ల యాజమాన్యాలకు చెప్పినా వాళ్లు తెప్పించి బిల్లులో వాటిని జత చేస్తారు.

థియేటర్‌ను తలదన్నేలా..

మినీ థియేటర్‌లోకి అడుగు పెడుతూనే ప్రజలు కొత్త అనుభూతి పొందుతున్నారు. లోపల పెద్ద థియేటర్ స్క్రీన్, డాల్బీ సౌండ్ సిస్టం ఏర్పాటు చేసి ఉంటుంది. స్క్రీన్ సైజులు 135 నుంచి 180 అంగుళాలు, సౌండ్ 600 వాట్స్ నుంచి వెయ్యి వాట్స్ వరకు ఉంటున్నాయి. ఫాగ్ ఎంట్రీలు కూడా కొన్ని థియేటర్లలో ఉంటు న్నాయి. ఫొటో షూట్ కావాలన్నా ఏర్పాటు చేస్తున్నారు. లోపల సినిమా సెట్‌ను తలదన్నేలా ఫాగ్ ఉంటుంది. సినిమా థియేటర్ తరహాలో సోఫా సీట్లు ఏర్పాటు చేశారు. ఎల్‌ఈడీ లైటింగ్, కేక్‌లు కట్ చేసుకునేందుకు వేదిక ఉంటుంది. వేదికపై డెకరేషన్, లైటింగ్ ఏర్పాటు చేస్తున్నారు. వైఫై సౌకర్యం, థియేటర్ బయట అందమైన బ్యాక్‌డ్రాప్‌లు రూపొందిస్తున్నారు. 16 డిగ్రీల సెల్సియస్‌తో చల్లటి వాతావరణం ఉండేలా ఏసీ సౌకర్యం కల్పిస్తున్నారు. ఇంటిల్లిపాదీ వెళ్లి ఆనందంగా వేడుక నిర్వహించుకునేలా అన్ని సౌకర్యాలు ఉండడం ఈ మినీ థియేటర్ల ప్రత్యేకత.


ప్రజల అభిరుచికి తగ్గట్టుగా మినీ థియేటర్‌లో అలంకరణలు



ప్రత్యేకతలేమిటంటే...

ఈ మినీ థియేటర్లలో డాల్బీ సౌండ్ సిస్టమ్‌తో ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. అందులో ఇష్టమైన సినిమా, టీవీ షోలను వీక్షిస్తూ ఆస్వాదించొచ్చు. కొందరైతే గతంలో రికార్డు చేసిన ఫంక్షన్ల పెన్‌డ్రైవ్‌లు, కాలేజీల్లో జరిగిన ఫ్రెషర్స్ డే వేడుకలు, ఫేర్‌వెల్ పార్టీల వీడియోలు తీసుకొచ్చి వాటిని ప్రదర్శించుకుంటూ జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందం పొందుతున్నారు. స్నాక్స్, ఇతర ఫుడ్ ఐటమ్‌లు, బెవరేజస్ తెప్పించుకుని సెల్ఫ్ సర్వ్ చేసుకుంటూ సంతోషంగా గడుపుతున్నారు.


ఆకట్టుకునేలా లైటింగ్


మినీ థియేటర్‌లో ఫంక్షన్ వేళ...

రెస్పాన్స్ బాగుంది



మేము తొలుత హైదరాబాద్‌లో ఈ మినీ థియేటర్‌ను ఏర్పాటు చేశాం. స్మార్ట్ సిటీ కాకినాడలో కూడా ఇలాంటి కల్చర్ ప్రజలకు అందుబాటులో ఉండాలనే ఆలోచనతో జేఎన్టీయూ ఎదురుగా ఉన్న వీధిలో మినీ థియేటర్ ఏర్పాటు చేశాం. రెస్పాన్స్ బాగుంది. సింపుల్‌గా చిన్న చిన్న పార్టీలు సరదాగా రెండు, మూడు గంటలు గడిపేలా వాతావరణం క్రియేట్ చేశాం. చాలా మంది సందర్శిస్తున్నారు.

- వేణుగోపాల్, మినీ థియేటర్ నిర్వాహకుడు


జేఎన్టీయూకే ప్రధాన పరిపాలనా భవనం

వచ్చే నెల 4న

జేఎన్టీయూకే 11వ స్నాతకోత్సవం

- అధ్యక్షత వహించనున్న కులపతి, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్
- 2023-24 విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిగ్రీల ప్రదానం
- ముఖ్య అతిథి, బోస్టన్ గ్రూప్ చైర్మన్ కోట సుబ్రహ్మణ్యానికి గౌరవ డాక్టరేట్
- ప్రత్యేక అతిథిగా పాల్గొననున్న విద్యా శాఖ మంత్రి లోకేశ్

జేఎన్టీయూకే, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ 11వ స్నాతకోత్సవాన్ని వచ్చే నెల వర్సిటీలోని అలూమ్ని ఆడిటోరియంలో మధ్యాహ్నం మూడు గంటల నుంచి నిర్వహించనున్నట్టు ఉప కులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేస్తామన్నారు. విశ్వవిద్యాలయ కులపతి, రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ అధ్యక్షత వహిస్తారన్నారు. ముఖ్య అతిథిగా హాజరయ్యే అమెరికాలోని బోస్టన్ గ్రూప్ చైర్మన్ కోట సుబ్రహ్మణ్యం (సుబు కోట)కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తామన్నారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక అతిథిగా పాల్గొంటారన్నారు. బీటెక్, బి.ఫార్మసీ, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, ఎం.ఫార్మసీ, టీబీఏ, ఫార్మా-డి, బీఆర్క్ విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేస్తామని ఇన్‌చార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్ తెలిపారు. 99 మంది రీసెర్చ్‌స్కాలర్స్ పీహెచ్‌డీ పట్టాలు అందుకోనున్నారు. కులపతి, ఇతర అతిథుల సమక్షంలో ప్రతిభావంతులైన 40 మంది విద్యార్థులకు ఎండోమెంట్, బంగారు పతకాలు అందజేస్తారని తెలిపారు. స్నాతకోత్సవ వేడుకల్లో మాజీ ఉప కులపతులు, అతిథులు, విద్యావేత్తలు, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి అధికారులు, ఉన్నత విద్యా శాఖాధికారులు, జిల్లా అధికారులు, విద్యావేత్తలు, వర్సిటీ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొనాలని కోరారు.

డిగ్రీలు, పీహెచ్‌డీలు, బంగారు, ఎండోమెంట్ పతకాల వివరాలు

కోర్సు పేరు	2023-24 విద్యా సంవత్సరం
బీటెక్	41,258
బి.ఫార్మసీ	2,081
ఎంటెక్	1,659
ఎంబీఏ	3,797
ఎంసీఏ	1,115
ఎం.ఫార్మసీ	458
టీబీఏ	115
ఫార్మా-డి	274
బీఆర్క్	83
పీహెచ్‌డీ	100

నన్నయలో విద్యాప్రవేశాలకు ఆహ్వానం

వీసీ ప్రసన్నశ్రీ


కోర్సుల వివరాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, జూన్27 (ఆంధ్రజ్యోతి) : ఏపీ పీజీ సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులను ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ప్రవేశాలకు ఆహ్వానిస్తున్నామని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. విశ్వవిద్యాలయంలోని వీసీ కార్యాలయంలో విశ్వవిద్యాలయాల ప్రవేశాలకు సంబంధించిన బ్రోచర్‌ను శుక్రవారం వీసీ ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నన్నయ వర్సిటీ రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్‌లలో ఆర్ట్స్ అండ్ కామర్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగాల్లో పీజీ కోర్సులు అందిస్తున్నామన్నారు. ఆయా క్యాంపస్‌లలో అందుబాటులో ఉన్న కోర్సులు వివరాలు తెలిపారు. తాము పేర్కొన్న వివిధ కోర్సులకు సంబంధించి ప్రభుత్వం నిర్వహించే కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌లో అర్హత సాధించిన వారికి ప్రవేశం లభిస్తుందన్నారు. రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం ప్రాంగణాల్లో అడ్మిషన్ పొందిన అర్హులైన విద్యార్థులకు ప్రభుత్వ రాయితీలు వర్తిస్తాయని తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను లేదా 70930 08477 నెంబరును సంప్రదించాలని తెలిపారు. అడ్మిషన్‌ల ప్రక్రియను డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆచార్య పి.ఉమామహేశ్వరీదేవి, అసోసియేట్ డైరెక్టర్ ఎన్.సజనారాజ్ నిర్వహిస్తారన్నారు.

అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమవ్వాలి

పీడీజే సునీత


సమావేశంలో మాట్లాడుతున్న పీడీజే సునీత

రాజమహేంద్రవరం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): జూలై 5న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత ఆదేశించారు. ఈ మేరకు పోలీస్, ఎక్సైజ్ అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజీకి అర్హమైన కేసులు అధిక సంఖ్యలో పరిష్కారం కావడానికి ఇరు పక్షాలకు జాతీయ లోక్ అదాలత్ గురించి తెలియజేయాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మీ, కోనసీమ ఈఎస్ ప్రసాద్, అడిషనల్ ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, తూర్పుగోదావరి అడిషనల్ ఎస్పీ మురళీ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నల్సా పథకాలపై నేడు వర్క్‌షాప్

జాతీయ లీగల్ సర్వీసెస్ అథారిటీ(నల్సా) పథకాలపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా యంత్రాంగం సంయుక్తంగా శనివారం ఉదయం నుంచి రాజమహేంద్రవరం ఆనం కళా కేంద్రంలో కార్యశాల నిర్వహిస్తున్నామని కార్యక్రమ సమన్వయకర్త, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి శుక్రవారం తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, డీఎల్ ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మీ, కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిశోర్ తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.

కాపులను సంఘటితం చేస్తాం

రాజ్యసభ సభ్యుడు సతీష్‌బాబు


ఎంపీ సతీష్‌బాబును సత్కరిస్తున్న క్రికెట్ అసోసియేషన్

సామర్లకోట, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాపులందరినీ ఏకతాటిపైకి తెచ్చి ఆ సామాజికవర్గం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడం ద్వారా సంఘటితం చేస్తామని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు వెల్లడించారు. కాకినాడ జిల్లా సామర్లకోట మండలం కొప్పవరంలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన ఉమ్మడి జిల్లాలకు చెందిన కాపు సంఘ నాయకులు, కాపు ప్రముఖులతో అంతరంగిక సమావేశం నిర్వ హించారు. అనంతరం ఎంపీ విలేకరులతో మాట్లాడుతూ గతంలో జరిగిన పలు ఉద్యమాలను దృష్టిలో ఉంచుకుని ఏ వర్గానికీ, ఏ నాయకుడికీ అవమానం జరుగని రీతిలో కాపు నాయకులతో సమీక్షిస్తానన్నారు. రాష్ట్రంలో కాపు సంఘాలను లీడ్ చేయాలన్న ఆలోచన తనకు ఎంతమాత్రం లేదని ఒక ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. ఆ సామాజిక వర్గానికి చెందిన రాజ్యసభ సభ్యుడిగా, సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి లోకేశ్‌లతో ఉన్న సాన్నిహిత్యంతో పేద కాపులందరికీ న్యాయం చేసేందుకు తన వంతు ప్రయత్నంగా ముందుకొచ్చానన్నారు. రాష్ట్రంలోని కాపు నాయకుల అభిప్రాయాలను, సూచనలను పరిగణలోకి తీసుకుంటానని, తన ప్రయత్నానికి సహకారం కావాలన్నారు.

ఎంపీని కలిసిన క్రికెట్ అసోసియేషన్

కాకినాడ సిటీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు శుక్రవారం ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబును కాకినాడలోని శాంతినగర్‌లో తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎంపీని కలిసిన వారిలో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శివకుమార్, కార్యదర్శి కొప్పన ప్రసాద్, కోశాధికారి భారతం సూర్యనారా యణమూర్తి, సంయుక్త కార్యదర్శి నక్క శ్రీనగేష్, కౌన్సిల్ మెంబర్లు ఏవీటీ వర్మ, టీవీఎల్ నరసింహరావు తదితరులున్నారు.

తిరుపతి జిల్లా నుంచి పలువురు బీజేపీలో చేరిక

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి సమక్షంలో శుక్రవారం తిరుపతి జిల్లాకు చెందిన పలువురు బీజేపీలో చేరారు. రాజమహేంద్రవరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పురందేశ్వరి కండువాలను కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. తిరుపతి జిల్లా సత్యవేడు అసెంబ్లీ కన్వీనర్ మునిస్వామి ఆధ్వర్యంలో పిచ్చాటురు మండలం మాజీ వైస్ ఎంపీపీ బొరందూరు పద్మనాభం, రామాపురం మాజీ ఎంపీటీసీ కన్నెగాన్ వడివేలు, వేలూరు గ్రామ మాజీ సర్పంచ్ పల్లా శేఖర్, వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర గజేంద్ర తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జీజీయూలో జాతీయ సెమినార్

రాజానగరం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం(జీజీయూ)లో ఈ నెల 28 నుంచి రెండు రోజుల పాటు వికసిత్ భారత్ ఎట్ ది రేట్ 2047 కోసం పరిశోధన, ఆవిష్కరణలను ఉపయోగించడం అనే అంశంపై జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నట్టు ఛాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు(చైతన్యరాజు), ప్రో ఛాన్సలర్ కె.శశికిరణ్ వర్మ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం ఇక్కడి విలేకరులకు వివరించారు. జీజీయూలో 28,29 తేదీల్లో జరిగే ఈ సెమినార్‌లో నీతి అయోగ్ సభ్యులు విజయకుమార్ సరస్వతి, అఖిల భారత సాంకేతిక విద్యా మండలి(ఏఐసీటీఈ) చైర్మన్ ఆచార్య టీజీ సీతారాం, బయోటెక్నాలజీ పరిశ్రమ పరిశోధన సహాయ మండలి(బైరాక్) మేనేజింగ్ డైరెక్టర్ జితేంద్రకుమార్, ఐసీఎంఆర్ అడిషనల్ డైరెక్టర్ సంఘమిత్ర పాటి, అఖిల భారత ఆయుర్వేద సంస్థ డైరెక్టర్ తనూజ నేసారి, సీఎస్ఐఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మినరల్స్ అండ్ మెటీరియల్స్ టెక్నాలజీ డైరెక్టర్ రామానుజ నారాయణ తదితర ప్రముఖులు హాజరై ప్రసంగిస్తారన్నారు. అలాగే దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వివిధ రంగాల్లో నిష్ణాతులైన దాదాపు 50 మందికి పైగా ప్రతినిధులు విచ్చేసి వివిధ అంశాలపై ఉపన్యసిస్తారన్నారు. బోధన, పరిశోధన, పారిశ్రామిక రంగాల నుంచి దాదాపు 250 మంది సెమినార్‌కు హాజరవుతారని చెప్పారు. సమావేశంలో జీజీయూ వైస్ చాన్సలర్ యు.చంద్రశేఖర్, ప్రో వైస్ చాన్సలర్ కేవీబీ రాజు, రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, ఎం.శ్రీనివాసరావు, పరిశోధన సలహాదారు శిశిర్ సాహు, డైరెక్టర్ టీవీ ప్రసాద్, యూనివర్సిటీ ప్రాంగణంలోని వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

ఒకే రకమైన మెరైన్ యాక్ట్‌ను అమలు చేయాలి

విశాఖపట్నం సీఎంఎఫ్ఆర్ఐ శాస్త్రవేత్తలు

కాకినాడ సిటీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో విస్తరించియున్న సముద్ర తీర ప్రాంత రాష్ట్రాలన్నింటికి ఒకే రకమైన మెరైన్ యాక్ట్‌ను అమలు చేయాలని విశాఖపట్నం సీఎంఎఫ్ఆర్ఐ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. మత్స్యశాఖ కమిషనర్ సూచనల మేరకు ఆంధ్రప్రదేశ్ మెరైన్ ఫిషరీస్ రెగ్యులేషన్ యాక్ట్-1994, దాని నిబంధనల సవరణ నిమిత్తం సలహాలు, సూచనలు స్వీకరించేందుకు కాకినాడ జగన్నాథపురంలోని రాష్ట్ర మత్స్య సాంకేతిక పరిజ్ఞాన సంస్థ(ఎస్ఐఎఫ్ఈటీ)లో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అంజలి ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు, ఏపీ ఫిషరీస్ యూనివర్సిటీ ప్రతినిధులు, వివిధ జిల్లాల మత్స్యశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు.విశాఖపట్నం నుంచి సీఎంఎఫ్ఆర్ఐ శాస్త్రవేత్త డాక్టర్ ముక్త, సీఐఎఫ్‌టీ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీధర్, ఎఫ్ఎస్ఐ శాస్త్రవేత్త ప్రసాద్, నెట్ ఫిష్ స్టేట్ కో-ఆర్డినేటర్ హనుమంతరావు, శాస్త్రవేత్త ప్రభంజన్‌కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అంజలి మాట్లాడుతూ వర్తమానం, భవిష్యత్తులో రాబోయే మార్పుల దృష్ట్యా ఈ యాక్ట్‌లో సవరణలు చేయడానికి సలహాలు, సూచనలివ్వాలని కోరారు. శాస్త్రవేత్తలు, మత్స్యశాఖ అధికారులు మాట్లాడుతూ ఏపీ మెరైన్ ఫిషరీస్ రెగ్యులేషన్ యాక్ట్‌ను సమర్థవంతంగా అమలు చేయడంలో సవాళ్లను అధిగమించాలన్నారు. సంప్రదాయ మత్స్యకారులకు రిజర్వ్ చేయాల్సిన సముద్ర జలాలు, వివిధ రకాల బోట్లు పొడవు, ఇంజన్ సామర్థ్యం తదితర అంశాలపై సూచనలు చేశారు.

వాడపల్లి వెంకన్నకు 3 టన్నుల కూరగాయలు


సీతానగరం నుంచి కూరగాయలను పంపుతున్న దృశ్యం

సీతానగరం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్ కోనసీమ ఆత్రేయపురం మండలం వాడపల్లిలోని వాడపల్లి వెంకన్న ఆలయానికి తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం నుంచి శుక్రవారం 3 టన్నుల కూరగాయలు విరాళంగా పంపించారు. అక్కడ ఆలయంలో జరుతున్న నిత్యాన్నదాన కార్యక్రమానికి వాకపల్లి సూరిబాబు ఆధ్వర్యంలో సీతానగరం మండల ప్రజలు సమష్టిగా 3టన్నుల కూరగాయలు సమకూర్చి శుక్రవారం పంపించారు. కార్యక్రమంలో పలివెల వీరబాబు, కోసూరి త్రిమూర్తులు, సింగవరం సర్పంచ్ సంగన పోశియ్య, పోలినాటి నరసింహమూర్తి పాల్గొన్నారు.

రాష్ట్రానికి కాంగ్రెస్ పాలన అవసరం

- పోలవరం ఎత్తు తగ్గించి అన్యాయం చేశారు
- యోగాపై ఉన్న శ్రద్ధ రాష్ట్రాభివృద్ధిపై లేదు
- పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలారెడ్డి



రాజమహేంద్రవరంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో పాల్గొన్న షర్మిళారెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి కాంగ్రెస్ పాలన అవసరమని పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిళారెడ్డి అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం షర్మిళారెడ్డి, ఏపీ సీసీ ఇన్‌చార్జి పాలక్ వర్మతో కలిసి రాజమహేంద్రవరం చేరుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక కృష్ణసాయి కళ్యాణ మండపంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో షర్మిళారెడ్డి మాట్లాడారు. రాష్ట్రాన్ని బీజేపీ దారుణంగా మోసం చేసిందన్నారు. విభజన హామీల్లో ఒక్కటీ అమలు కాలేదన్నారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించి మోసం చేశారన్నారు. 45మీటర్ల నుంచి 41కి ఎత్తు తగ్గిస్తే అది ప్రాజెక్టు ఎలా అవుతుందని ప్రశ్నించారు. రాష్ట్రంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ మోదీకి ఊడిగం చేస్తున్నారని, పార్టీలన్నీ గులాం గిరి చేస్తున్నాయన్నారు. విభజన హామీల్లో ఒకటైన రాజధానిని కేంద్రమే నిర్మించి ఇవ్వాలని, కాని అప్పు ఇచ్చిందన్నారు. అభివృద్ధిని పక్కన పెట్టి యోగా చేసి ప్రధాని వెళ్లిపోయారని, యోగాపై ఉన్న శ్రద్ధ రాష్ట్ర అభివృద్ధిపై లేదన్నారు. దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని, రాహుల్‌గాంధీ ప్రధాని కావాలన్నారు.రానున్న నాలుగేళ్లు అత్యంత కీలకమని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి జిల్లా పర్యటనలు, విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

పీసీసీ చీఫ్‌కు ఘనస్వాగతం.. రాజమహేంద్రవరం పర్యటనకు వచ్చిన పీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిళారెడ్డికి జిల్లా కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. గోకవరం బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి షర్మిళ నివాళులర్పించారు. అపై సీతంపేట వాటర్ ట్యాంక్‌ల వరకు గుర్రంబండిపై ఊరేగింపు జరిపారు.అక్కడ రాజీవ్‌గాంధీ పార్కులో దివంగత ప్రధాని ఇందిరా గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో ఏఐసీసీ నేత గిడుగు రుద్రరాజు, మాజీ కేంద్ర మంత్రి పల్లంరాజు, మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్, డాక్టర్ వడయార్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నేతలు, కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు పాల్గొన్నారు.

డిగ్రీ అడ్మిషన్లు ఎప్పుడో!

ఇంటర్మీడియట్ ఫలితాలు వచ్చి రెండు నెలలు కావస్తోంది. అయితే డిగ్రీ కళాశాలల్లో ప్రవేశ ప్రకియ ఇప్పటి వరకు ప్రారంభం కాలేదు. అడ్మిషన్లను ఆన్‌లైన్‌లో లేదా ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలనే విషయంపై ప్రభుత్వం ఎటూ తేల్చకపోవడంతో సందిగ్ధత నెలకొంది. ప్రవేశాలపై అధికారిక ప్రకటన రాకుండానే ప్రైవేటు కళాశాలలు ముందస్తుగానే విద్యార్థులను చేర్చుకుంటున్నాయి. ఆన్‌లైన్‌లో తమ కళాశాలనే ఎంచుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. ఫలితం గా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సీట్లు మిగిలిపోయే అవకాశం ఉంది. నన్నయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది.

- ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లోనా
- ఎటూ తేల్చని ప్రభుత్వం
- ఇంటర్ ఫలితాలు వచ్చి ఇప్పటికే రెండు నెలలు
- పలు ప్రైవేటు కళాశాలల్లో విద్యార్థుల ముందస్తు చేరికలు
- ప్రభుత్వ కాలేజీల్లో సీట్లు మిగిలిపోయే అవకాశం
- ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు ఎప్పుడు ప్రారంభమవుతాయో తెలియట్లేదు. ఇప్పటికే 1 నుంచి 10వ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాలు పూర్తయి తరగతులు ప్రారంభమయ్యాయి. డిగ్రీలో మాత్రం అందుకు విరుద్ధంగా వుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ప్రవేశాలపై ఎటువంటి స్పష్టత ఇవ్వలేదు. గత వైసీపీ ప్రభుత్వం డిగ్రీ విద్యను అస్తవ్యస్తం చేయడం, ఆన్‌లైన్ ప్రక్రియలో ప్రవేశాలతో సృష్టించిన గందరగోళంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారు. ఇప్పుడు దానిని సరిచేసే పనిలో ఉన్న ఉన్నత విద్యాశాఖ, రాష్ట్ర ఉన్నత విద్యామండలి సమయం అధికంగా తీసుకోవడంతో దాని ప్రభావం డిగ్రీ ప్రవేశాలపై పడింది. ప్రవేశాలను ఎప్పటికి ప్రారంభిస్తారనే విషయాన్ని ఇప్పటివరకు ఎవరూ చెప్పలేకపోతున్నారు.

అస్తవ్యస్తం ఆన్‌లైన్ విధానం

కాకినాడ జిల్లాలో కాకినాడ నగరంతో పాటు పిఠాపురం, తుని, ఏలేశ్వరం, జగ్గంపేట, పెరుమాళ్లపురం, పెద్దాపురంల్లో ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలలు ఉన్నాయి. వీటికి దాదాపు మూడు రెట్లు అదనంగా ప్రైవేటు డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. వీటిల్లో 20వేలకు పైగా సీట్లు ఉన్నాయి. కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి గతం నుంచీ అమల్లో ఉన్న విధానాన్ని వైసీపీ ప్రభుత్వం మార్చివేసింది. 2022-23 విద్యా సంవత్సరం నుంచి ఆన్‌లైన్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. ఫలితంగా ప్రవేశాల్లో తీవ్ర గందరగోళానికి దారితీసింది. అప్పటిదాకా జూన్ నెలాఖరుకు పూర్తయ్యే ప్రవేశాలు ఆగస్టు, సెప్టెంబరు నెలలకు గానీ పూర్తి కాని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఫలితంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సీట్లు భారీగా మిగిలిపోయాయి. దీంతో మరలా ఆఫ్‌లైన్ విధానం అమలు చేయాలన్న వాదనలు వినిపిస్తున్నాయి.



పిఠాపురంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ఎటూ తేలని సబ్జెక్టు విధానం

డిగ్రీలో ఉన్న విద్యా విధానాన్ని గత వైసీపీ ప్రభుత్వం మార్చివేసింది. అప్పటివరకు అమలులో ఉన్న మూడు సబ్జెక్టుల విధానాన్ని రద్దు చేసి సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానాన్ని అమలు చేసింది. దీనికి అనుగుణంగా అన్ని రకాల సబ్జెక్టులను ప్రభుత్వ కళాశాలల్లో అందుబాటులో ఉంచకపోవడంతో విద్యార్థులు ప్రైవేటు కళాశాలల వైపు మొగ్గుచూపడం ప్రారంభించారు. ఈ విధానం సరిగా లేదని భావించిన రాష్ట్ర ఉన్నత విద్యా మండలి డబుల్ మేజర్ సబ్జెక్టు విధానం అమలు చేస్తామని ప్రకటించినా ప్రభుత్వం నిలిపివేయాలని ఆదేశించి పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని సూచించింది. అందుకనుగుణంగా సింగిల్ మేజర్ లేదా డబుల్ మేజర్ సబ్జెక్టుల విధానం అమలు గురించి ఉన్నత విద్యా మండలి సవివరంగా ప్రభుత్వానికి నివేదిక పంపింది. దీనిపై ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

నెలకు పైగా సాగే ప్రక్రియ



ఆన్‌లైన్‌లో లేదా ఆఫ్‌లైన్‌లో అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించినా అది నెలకు పైగా సాగుతుంది. గతంలో ఇందుకు రెండు నెలల సమయం తీసుకున్నారు. ఇప్పటి దాకా ప్రవేశాల షెడ్యూల్ విడుదల చేయకపోవడంతో పాటు ఏ విధంగా అడ్మిషన్లు జరపాలన్న దానిపై నిర్ణయం తీసు కోలేదు. ఆన్‌లైన్‌లో అయితే రిజిస్ట్రేషన్ ప్రక్రియ, కళాశాలలు, కోర్సులు ఎంచుకునేందుకు వెబ్ ఆప్షన్లు, సీట్ల కేటాయింపు, తర్వాత ప్రవేశాలు జరగాల్సి ఉంటుంది. తొలి విడతలో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు మరో రెండు విడతలు ప్రక్రియ నిర్వహించాలి. ఇదంతా జరిగి క్లాసులు ప్రారంభమయ్యేసరికి ఆగస్టు నెల వస్తుందని చెప్తున్నారు. ఆఫ్‌లైన్‌లో అయితే మొత్తం ప్రకియను 15రోజుల్లో పూర్తి చేసి తరగతులు ప్రారంభించే వీలుంటుంది.

విద్యార్థులు ఇప్పటికే అటువైపు

అడ్మిషన్ల ప్రక్రియ ప్రకటనలో జరుగుతున్న జాప్యాన్ని ప్రైవేటు కళాశాలలు తమకు అనుకూలంగా మార్చుకున్నాయి. ఇంటర్ ఫలితాలు వచ్చిన వెంటనే కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోని తమ కళాశాలల్లో వారిని అనధికారికంగా చేర్చుకోవడంతో పాటుమార్కుల జాబితాలు, టీసీ, ఇతర సర్టిఫికెట్లను వారి వద్ద ఉంచుకున్నాయి. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైన వెంటనే ఇప్పటికే చేరినవారిని దరఖాస్తు చేయించి తమ కళాశాలలను ఆప్షన్లుగా ఎంచుకునే విధంగా ఏర్పాట్లు చేసుకున్నారు. దీనివల్ల ప్రైవేటు కళాశాలలకు అధిక ప్రయోజనం కలుగుతుండగా, ప్రభుత్వ కళాశాలల్లో సీట్లు పూర్తిగా నిండట్లేదు. గత రెండు సంవత్సరాలలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో పలు సీట్లు ఖాళీగా ఉండిపోయాయి. ప్రవేశాల్లో ఇంకా జాప్యం జరిగితే ఇదే పరిస్థితి ఈ ఏడాదీ కొనసాగే అవకాశముంది. ప్రభుత్వం స్పందించి ప్రవేశాల షెడ్యూల్ ప్రకటించడంతో పాటు సింగిల్ లేదా డబుల్ మేజరు సబ్జెక్టులపై త్వరగా తుది నిర్ణయం తీసుకోవాలని విద్యావేత్తలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.



ఆలమూరులో కానిస్టేబుల్ బ్లెసన్ అంత్యక్రియలు నిర్వహిస్తున్న పోలీసులు

కానిస్టేబుల్ బ్లెసన్‌కు కన్నీటి వీడ్కోలు

- అధికార లాంఛనాలతో అంత్యక్రియలు
- పాల్గొన్న డీఎస్పీ, సీఐలు, సిబ్బంది

ఆలమూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కేదాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కోనసీమ జిల్లా ఆత్రేయపురం పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ ఎస్.బ్లెసన్ అంత్యక్రియలు ఆలమూరులో శుక్రవారం పోలీస్ అధికార లాంఛనాలతో జరిగాయి. గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో బ్లెసన్ మృతిచెందిన విషయం తెలిసిందే. అంత్యక్రియలు శుక్రవారం ఉదయం బ్లెసన్ ఇంటి వద్ద ప్రారంభమయ్యాయి. ముందుగా కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్.విద్యాసాగర్, రావులపాలెం టౌన్ సీఐ శేఖర్‌బాబు, ఆలమూరు ఏఎస్ఐ సూర్యచంద్రరావుతోపాటు రావులపాలెం సర్కిల్ పరిధిలోని పలువురు సిబ్బంది బ్లెసన్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత మృతదేహాన్ని ఊరేగింపుగా గోదావరి గట్టుకు కన్నీటి వీడ్కోలుతో తరలించారు. అక్కడ పోలీస్ అధికార లాంఛనాలతో గాలిలోకి కాల్పులు జరిపి పోలీసు వందనం చేసి పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలతో అంత్యక్రియలు నిర్వహించారు.



బ్లెసన్ (ఫైల్)

ఆర్థిక ఇబ్బందులు తాళలేక
కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం

సామర్లకోట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వెంటూరి దుర్గేష్ గురువారం అర్ధరాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆర్థిక ఇబ్బందులకు తాళలేక దుర్గేష్ ఇలా చేసినట్టు ప్రాథమికంగా గుర్తించారు. ప్రస్తుతం మాధవపట్నంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా శుక్రవారం సాయంత్రం నాటికి అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్టు వైద్యులు చెప్పారని దుర్గేష్ కుటుంబ సభ్యులు తెలిపారు. అమలాపురానికి చెందిన దుర్గేష్ ప్రస్తుతం కాకినాడలోని జగన్నాథపురంలోని అత్తవారింట నివాసం ఉంటున్నాడు. విజయవాడ పిటి వారెంట్‌కి వెళ్లి తిరిగొచ్చి రెస్ట్‌లో ఉన్నట్టు తెలుస్తోంది. గురువారం అర్ధరాత్రి 12 గంటలకు వీకె.రాయపురం బస్టాండ్ వద్ద అపస్మారక స్థితిలో ఉన్న దుర్గేష్‌ను చూసిన స్థానికుల సమాచారంతో కుటుంబసభ్యులు వీకె.రాయపురం వెళ్లి మాధవపట్నంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



దుర్గేష్

అనకాపల్లి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

కంటైనర్ లారీని బొలేరో వ్యాన్ ఢీకొని డ్రైవర్, మహిళ మృతి

డ్రైవర్ సొంతూరు కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామం

కశింకోట (అనకాపల్లి జిల్లా), జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా కశింకోట మండలం జమాదులపాలెం సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రోడ్డుపై ఆగి ఉన్న కంటెయినర్ లారీని వెనుక నుంచి వస్తున్న బొలేరో వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో మహిళతో సహా ఇద్దరు మృతిచెందారు. మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ లక్ష్మణరావు తెలిపిన వివరాలిలా ఉన్నా యి. కశింకోట మండలం తీడ గ్రామానికి చెందిన కన్నూరు లక్ష్మి(40), అనకాపల్లి మండలం కోడూరు గ్రామానికి చెందిన ఎస్.వరలక్ష్మి గాజువాకలో పూల వ్యాపారం చేస్తుంటారు. ఇందుకోసం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో హోల్‌సేల్‌గా పూలు కొనుగోలు చేసి తీసుకువస్తుంటారు. గురువారం కూడా ఇద్దరూ కలిసి రాజమహేంద్రవరం వెళ్లి పూలు కొనుగోలు చేశారు. తిరిగి రావడానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లా రావులపాలెం నుంచి దొండ కాయల లోడుతో అనకాపల్లి వైపు వస్తున్న బొలేరో వ్యాన్‌లో ఎక్కారు. ఇదే జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన పి.సత్యనారాయణ (25) వ్యాన్ డ్రైవ్ చేస్తున్నాడు. మహిళలిద్దరూ డ్రైవర్ పక్కన క్యాబిన్‌లో కూర్చున్నారు. వ్యాన్ గురువారం అర్ధరాత్రి 1.45 గంటలకు కశింకోట మండలం జామాదుల పాలెం వద్ద రోడ్డుపై ఆగి ఉన్న కంటైనర్ లారీని వెనుక నుంచి బలంగా ఢీకొంది. ఇంజన్‌తో సహా వ్యాన్ ముందుభాగం పూర్తిగా కంటైనర్ లారీ కిందకు దూసుకుపోయింది. దీంతో డ్రైవర్ సత్యనారాయణ, కన్నూరు లక్ష్మి వ్యాన్ శకలాల్లో ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతిచెందారు. వరలక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను అన కాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు పంపారు. మృతదేహాలను అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. మధ్యాహ్నం పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కన్నూరు లక్ష్మి భర్త వరహాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ లక్ష్మణరావు చెప్పారు.



సత్యనారాయణ (ఫైల్‌ఫొటో)

కాలు జారి చెరువులో పడి వ్యక్తి మృతి

ముమ్మిడివరం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): బహిర్భూకి వెళ్తూ ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడి మృతిచెందాడు. కోనసీమ జిల్లా రావులపాలెనికి చెందిన సబ్బతి అంబేడ్కర్ (37) భార్య గంగాభవానీతో కలిసి 2 రోజుల క్రితం ముమ్మిడివరం నగర పంచాయతీ వృద్ధ గౌతమీ మురుగుకాల్వ పక్కన రాజుపాలెంలో తన తోడల్లుడు గోడ కృష్ణ కాపలా ఉంటున్న చెరువుల వద్దకు వచ్చాడు. శుక్రవారం ఉదయం బహిర్భూమికి బయలుదేరిన అంబేడ్కర్ ప్రమాదవశాత్తూ కాలు జారి చెరువులో పడిపోయాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో కృష్ణ, అక్కడి వారు వెతగ్గా చెరువులో అంబేడ్కర్ మృతదేహం లభ్యమైంది. గంగాభవానీ ఫిర్యాదుతో ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



మరణించిన ఎస్.అంబేడ్కర్

విద్యామిత్ర కిట్ల స్టాక్ పాయింట్ పరిశీలన

తొండంగి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్ల స్టాక్ పాయింటును శుక్రవారం రాష్ట్ర పరిశీలకుడు సీహెచ్.భాస్కరరావు పరిశీలించారు. కాకినాడ జిల్లా తొండంగి ఉన్నత పాఠశాలలో ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన స్టాక్ పాయింటులో రికార్డులు తనిఖీ చేశారు. యూనిఫాం, బూట్లు, సాక్సు పరిశీలించారు. ఎప్పుడు వచ్చిన సరుకును అప్పటికప్పుడు పాఠశాలలకు పంపించాలని సూచించారు. మెగా పేరెంట్స్ డే జరిగే జూలై 5 నాటికి ప్రతి విద్యార్థి యూనిఫాంతో హాజరయ్యే విధంగా తల్లి దండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. తరగతి గదికి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. అందరికి పాఠ్యపుస్తకాలు అందాయాలేదా అన్నది ఆరా తీసారు. ఏఎంవో చామంతి నాగేశ్వరావు, తొండంగి ఎంఈవో 2 సుబ్బిరెడ్డి, యు.కొత్తపల్లి ఎంఈవో 2 పైడిరాజు, సీఆర్పీలు ఉన్నారు.



తొండంగిలో షూలు పరిశీలిస్తున్న భాస్కరరావు

విజయవాడ దుర్గమ్మకు
అన్నవరం తరుపున సారె, చీర

అన్నవరం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అన్నవరం సత్యదేవుడి సోదరిగా విరాజిల్లుతున్న విజయవాడ కనకదుర్గకు శుక్రవారం అన్నవరం దేవస్థానం తరుపున ఈవో సుబ్బారావు దంపతులు ఆషాడం సారె, చీరలను అందించారు. ఈ సందర్భంగా అన్నవరం దేవస్థానం నుంచి వెళ్లిన పండితులకు, అధికారులకు అక్కడ ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికారు. సత్యదేవుడి కల్యాణోత్సవాలకు విజయవాడ దేవస్థానం నుంచి పట్టువస్త్రాలు, దసరా నవరాత్రులలో అన్నవరం దేవస్థానం నుంచి అక్కడికి పట్టువస్త్రాలను పట్టుకెళ్లడం ఆనవాయితీగా వస్తుంది.



విజయవాడ దుర్గమ్మ ఆలయంలో ఆషాఢం సారెను తీసుకెళ్తున్న అన్నవరం ఆలయ ఈవో దంపతులు

తలుపులమ్మకు ఆషాఢం సారె సమర్పణ

తుని రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఆషాడ మాసోత్సవాలు పురస్కరించుకుని తొలి శుక్రవారం కాకినాడ జిల్లా తలుపులమ్మ తల్లి లోవ దేవస్థానంలో సారె సమర్పించే కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ ఆచారం ప్రకారం తుని రాజవంశీయులు ఎస్ఆర్‌వీ శ్రీని వాసరాజు, పృధ్వీరాజు, రమేష్ రాజు కుటుంబాలు తరలివచ్చి అమ్మవారికి చీర, పసుపు, కుంకుమ, గాజులు సమర్పించారు. ప్రత్యేక పూజలు అనంతరం ఆలయ పండితులు వారికి వేద ఆశీర్వచనాలు అందించారు.



అమ్మవారికి సారె తీసుకొస్తున్న రాజవంశీయులు



తలుపులమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శోభాయమానంగా..

రాజమహేంద్రవరంలో జగన్నాథస్వామి రథయాత్ర, తరలివచ్చిన భక్తజనం

రాజమహేంద్రవరం కల్చరల్ జూన్ 27(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఇస్కాన్ మందిరం ఆధ్వర్యంలో శుక్రవారం వేలాది మంది భక్తులతో జగన్నాథస్వామి రథయాత్ర శోభాయమానంగా జరిగింది. శ్యామలానగర్ రామాలయం సెంటర్ నుంచి ప్రారంభమైన యాత్రలో శ్రీజగన్నాథ బలదేవ సుభద్రల మూలవిరాట్‌ను ప్రతిష్ఠించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, స్థానిక ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ విచ్చేసి హారతిచ్చారు. వారికి ఇస్కాన్ మందిర కమిటీ ముఖ్య సభ్యుడు సత్యగోపీనాథ్ దాస్ ప్రసాదాలు అందజేశారు. అనంతరం రథయాత్రకు శ్రీకారం చుట్టారు. వేలాది మంది భక్త పారవశ్యంతో రథాన్ని లాగారు. కోలాట భజనలు, సాంస్కృతిక ప్రదర్శనలు, కీర్తనలుతో కనుల పండువగా రథయాత్ర సాగింది.



దేవీచౌక్ వద్ద జగన్నాథస్వామి రథయాత్ర దృశ్యం



రథయాత్ర ఆచారంలో భాగంగా..



రథయాత్రలో సాంస్కృతిక ప్రదర్శనలు



వేంకటేశ్వరస్వామి వేషధారణ

సత్యదేవుడి సన్నిధిలో టిడ్కో చైర్మన్ పూజలు



టిడ్కో చైర్మన్‌కు స్వామివారి ప్రసాదం అందజేస్తున్న పీఆర్వో కృష్ణారావు

అన్నవరం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో శుక్రవారం టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ పీఆర్వో కృష్ణారావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేయగా పీఆర్వో స్వామివారి ప్రసాదం అందించారు.

రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీ హోమం ఘనంగా జరిగింది. అమ్మవారికి చండీ,సప్తపారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. పవిత్ర హోమగుండంలో సు గంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. భక్తులకు తీర్థప్రసాదాలందించారు.

ఏపీ పీజీ సెట్‌లో 'ఆదిత్య' విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు

కాకినాడ రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఏపీ పీజీ సెట్-2025 ఫలితాల్లో ఆదిత్య విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు లభించినట్టు డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు తెలిపారు. వివిధ సబ్జెకుల్లో 10లోపు 11 ర్యాంకులను తమ విద్యార్థులు సాధించారన్నారు. రాష్ట్ర స్థాయిలో గణితంలో 1, 3, 5, 5, 8, కంప్యూటర్ సైన్స్‌లో 3, 8, 10, గణాంక శాస్త్రంలో 9, ఎలక్ట్రానిక్స్‌లో 4, 5 ర్యాంకులు సాధించారు. విద్యార్థులను, వారికి శిక్షణనిచ్చిన అధ్యాపకులను ఆదిత్య చైర్మన్ ఎన్.శేషారెడ్డి, కార్యదర్శి ఎన్.సుగుణారెడ్డి, ప్రిన్సిపాల్స్, వైస్ ప్రిన్సిపాల్స్ అభినందించారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్టు

23 కిలోల గంజాయి, కారు స్వాధీనం

కాకినాడ రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం సర్పవరం వసంతనగర్‌లో కారులో తరలిస్తున్న 23 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గు రిని అరెస్టు చేసినట్టు సర్పవరం సీఐ బి.పెద్దిరాజు తెలిపారు. ఎస్ఐ శ్రీనివాస్‌కుమార్, డీటీలు సిబ్బందితో కూడిన బృందం దాడి చేసి చల్లా నాగశివ మణికంఠ, మద్దాల ఉదయకుమార్, ఏనుగుపల్లి రాజుల వద్ద 23 కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించి రవాణాకు ఉపయోగించిన కారును స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు. జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లలో పలు కేసుల్లో వారి ప్రమేయం ఉందన్నారు. ముగ్గురు నిందితులు జ్యుడీషియల్ కస్టడీకి రిమాండ్ చేయగా తప్పించుకున్న నాల్గో నిందితుడిని పట్టుకునేందుకు చర్యలు కొనసాగుతున్నాయని సీఐ బి.పెద్దిరాజు పేర్కొన్నారు.



గంజాయి రవాణా చేస్తూ కారుతో పట్టుబడిన నిందితులు

మన్యంలో ముసురు

మోతుగూడెం-డొంకరాయి మార్గమధ్యంలో నేలకూలిన భారీ వృక్షం

మోతుగూడెం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ముసురు ప్రభావంతో అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెంలో రెండు రోజులుగా వర్షం పడుతూనే ఉంది. దీంతో ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. విద్యార్థులు, నిత్య కూలీలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మోతుగూడెం-డొంకరాయి మార్గమధ్యంలో శుక్రవారం తెల్లవారుజామున ఆర్అండ్‌బీ రహదారిపై భారీ వృక్షం నేలకూలింది. దీంతో వాహనదారుల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో గ్రామస్థులు చేరుకుని చెట్టును పక్కకు తొలగించడంతో వాహన రాకపోకలు యథావిధిగా సాగాయి వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో మోతుగూడెం మన్యంలో వాగులు, జలపాతాలు ఊపిరి పోసుకున్నాయి.



నేలకూలిన భారీ వృక్షం

విద్యార్థిమిత్ర కిట్ల పంపిణీ

సామర్లకోట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్‌లను కౌన్సిలర్ బలుసు శ్రీనివాసు శుక్రవారం అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు తోటకూర సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న పాడా పీడీ చైత్రవర్షిణి

‘ఓటర్లకు అనువుగా పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు’

పిఠాపురం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఓటర్లకు అనువుగా పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని పిఠాపురం నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, పాడా ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.చైత్రవర్షిణి తెలిపారు. పాడా కార్యాలయంలో శుక్రవారం ఆమె అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల పరిస్థితి, అక్కడ కల్పించాల్సిన సౌకర్యాలు, కేంద్రాల మార్పు తదితర అంశాలపై వారితో చర్చించి అభిప్రాయాలు సేకరించారు. అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి అక్కడ ఉన్న సౌకర్యాలను తనిఖీ చేస్తున్నట్టు చెప్పారు. అంతకు ముందు మండలంలోని కుమారపురం, కందరాడ, విరవ, విరవాడల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పిఠాపురం, గొల్లప్రోలు తహసీల్దార్లు వీవీ గోపాలకష్ణ, సత్యనారాయణ, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.


ప్రజా దర్బార్‌లో అర్జీ స్వీకరిస్తున్న ఎంపీ సతీష్‌బాబు

ఎంపీ సతీష్‌బాబు క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్

సామర్లకోట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొప్పవరంలో రాజ్యసభ సభ్యుడు క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆర్థికపరమైన సమస్యలను తాను స్వయంగా పరిష్కరించి, ప్రభుత్వపరమైన సమస్యలను వివిధ శాఖల అధిపతులకు అందజేస్తామన్నారు. గడిచిన 11 వారాలుగా నిర్వహించిన ప్రజా దర్బార్లకు వచ్చిన వాటిల్లో 300 సమస్యలను పరిష్కరించామన్నారు. ఈ వారం 27 అర్జీలు వచ్చాయి. కోటనందూరు మండలం బొద్దవరంలో తాండవ కాలువ నిర్మాణం చేపట్టాలని పలువురు వినతి పత్రం అందజేశారు. గంగనాపల్లి గ్రామస్తుల సౌకర్యార్థం ఆక్సిజన్ కిట్‌లను సానా సతీష్ బాబు ఫౌండేషన్ ద్వారా అందజేశారు.


మూలపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థిమిత్ర కిట్లు అందజేస్తున్న రాష్ట్ర పరిశీలకుడు భాస్కరరావు

విద్యార్థిమిత్ర కిట్ల పరిశీలన

కొత్తపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో లక్షా 30వేల మంది విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ చేశామని రాష్ట్ర పరిశీలకుడు చుక్కా భాస్కరరావు తెలిపారు. మండలంలోని మూలపేట జిల్లా పరిషత్ ఉన్నత విద్యార్థి కిట్ల పంపిణీని ఆయన శుక్రవారం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెగా పేరెంట్స్ డే నాడు విద్యార్థులంతా పూర్తి యూనిఫారాల్లో పాఠశాలకు హాజరు కావాలన్నారు. ఎంఈవో జి.పైడిరాజు, ప్రధానోపాధ్యాయుడు గీసాల శ్రీనివాసరావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


గొల్లప్రోలులో లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న జనసేన ఇన్‌చార్జి శ్రీనివాసరావు

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

గొల్లప్రోలు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులో నలుగురికి, తాటిపర్తి, వన్నెపూడి, కొడవలి గ్రామాల్లో ఒక్కొక్కరికి ఆరోగ్య అవసరాల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.8.39 లక్షలు మంజూరయ్యాయి. ఈ మొత్తాలను జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు శుక్రవారం లబ్ధిదారుల గృహాలకు వెళ్లి చెక్కుల రూపంలో పంపిణీ చేశారు. శ్రీనివాసరావు వెంట జనసేన నాయకులు బస్వా చిట్టిబాబు, అన్నందేవర పట్టాబి, బలిరెడ్డి గంగబాబు, పినకా వెంకట్రావు, మామిడాల సూరిబాబు, గరగ తాతాజీ, వినుకొండ అమ్మాజీ, బొజ్జా లోవరాజు తదితరులు పాల్గొన్నారు.


వన్నెపూడిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లే రహదారిపై నిలిచిపోయిన నీరు

రోడ్డుపై నీరు... పాఠశాలకు వెళ్లేదెలా!

గొల్లప్రోలు రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): స్కూలుకు వెళ్లే దారిలో నీరు నిలిచిపోతుండడంతో గొల్లప్రోలు మండలం వన్నెపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. విద్యార్థులు, స్థానికుల రాకపోకలకు వీలుగా సీసీ రోడ్డు నిర్మించారు. అయితే తరచూ నీరు నిలిచిపోతోంది. వర్షం పడినప్పుడు పరిస్థితి మరీ దారుణంగా ఉంటోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటిలో నుంచే రాకపోకలు సాగిస్తున్నామని తెలిపారు. డ్రైన్ లేకపోవడంతో ఈ సమస్య ఏర్పతోందని, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

‘అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం’


కరప మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నానాజీ

కరప, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం కూటమి ప్రభుత్వ ధ్యేయమని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. కరప చంద్రన్న సమావేశ మందిరంలో ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగిన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. మండలంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. గత మూడు నెలల కాలంలో జరిగిన ప్రగతిని ఆయా శాఖల అధికారులు వివరించి సందేహాలుంటే తెలపాలని సభ్యులను కోరారు. తొలుత మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని గాంధీజీ విగ్రహానికి, అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అరట్లకట్ట గ్రామానికి చెందిన కురుకూరి సాయిరామ్‌కు రూ.2.78 లక్షల సీఎం రిలీ ఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఎంపీడీవో మట్టపర్తి అనుపమ, తహసీల్దారు నందిపాటి సత్యనారాయణ, మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వీఆర్వోలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎంఈ రిజిస్ట్రేషన్‌తో అనేక ప్రయోజనాలు

ఐసీఏఐ సభ్యురాలు దుర్గాంజలి


ఐసీఏఐ వ్యవస్థాపకుడు కపాడి విగ్రహానికి పూలమాల వేస్తున్న అతిథులు

కాకినాడ సిటీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వర్తకులు, వ్యాపారవేత్తలు ఎంఎస్‌ఎంఈ రిజిస్ట్రేషన్ చేయించుకోవడం ద్వారా అనేక ప్రయోజనాలు పొందవచ్చని ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) సభ్యురాలు దుర్గాంజలి పేర్కొన్నారు. ఐసీఏఐ, ఎంఎస్‌ఎంఈ మహోత్సవ్‌లో భాగంగా శుక్రవారం కాకినాడ శాఖ కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో కాకినాడ శాఖ చైర్మన్ తాళ్లూరి శ్రీనివాసరాజు అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఐసీఏఐ మెంబర్ దుర్గాంజలి, విశిష్ట అతిథిగా డీఐసీ జీఎం గణపతి, గౌరవ అతిథిగా ది గోదావరి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు గ్రంధి బాబ్జీ విచ్చేశారు.

జ్యోతిప్రజ్వలన అనంతరం వారు మాట్లాడుతూ ఎంఎస్‌ఎంఈ పథకం ద్వారా ఏర్పాటుచేసే యూనిట్లకు ప్రభుత్వం రాయితీలు అందిస్తోందన్నారు. త్వరలో ఎస్‌బీఐతో కలిసి ఎంఎస్‌ఎంఈపై పెద్ద ఎత్తున అవగాహన సదస్సు ఏర్పాటు చేసి స్పాట్ లోన్స్ అందించే విధంగా కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. సదస్సులో కాకినాడ శాఖ కార్యదర్శి పాండురంగమూర్తి, కోశాధికారి పవన్‌కుమార్, అధిక సంఖ్యలో వర్తకులు, వ్యాపారులు, ఎంటర్‌ప్రెన్యూర్ చార్టర్డ్ అకౌంటెంట్లు పాల్గొన్నారు.

‘లైసెన్స్‌డ్ ఎలక్ట్రీషియన్లకు ఉపాధి కల్పించాలి’

పిఠాపురం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ద్వారా లైసెన్స్ పొందిన ఎలక్ట్రీషియన్ల ఉపాధికి, వివిధ ప్రభుత్వ, విద్యుత్ సంస్థల్లో కాంట్రాక్టు కార్మికులుగా అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని లైసెన్స్‌డ్ ఎలక్ట్రీషియన్ల సంఘ ప్రతినిధి మొల్లి సూర్యనారాయణ కోరారు. అనుభవం లేని వారితో పనిచేయించుకోవడం వల్ల తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. తమకు ఉపాధి కల్పించినప్పుడు ప్రభుత్వం ఎందుకు పరీక్షలు నిర్వహిస్తోందని ఆయన ప్రశ్నించారు. ఈ విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతిపత్రం పంపినట్టు తెలిపారు.

జీజీహెచ్‌కు వైద్య పరికరాల అందజేత

జీజీహెచ్ (కాకినాడ), జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రాణాపాయ సమయంలో అవసరమైన అత్యవసర వైద్య పరికరాలను కాకినాడ జీజీహెచ్‌కు స్నేహ హాస్పటల్‌కు చెందిన డాక్టర్ కాకర రామ్‌స్వరూప్ జవహర్ శుక్రవారం అందజేశారు. ఆర్థోపెడిక్ విభాగ ఆపరేషన్ థియేటర్‌కు సక్షన్ ఆపరేటర్స్, లెనిన్ క్లాత్, ప్లాస్టర్ కట్టర్, ఆర్టరీ ఫోర్సిప్స్ సమకూర్చిన డాక్టర్ జవహర్‌ను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి, డిప్యూటీ సూపరింటెండెంట్, ఆర్థో విభాగాధిపతి డాక్టర్ ఎంపీఆర్ విఠల్ అభినందించారు.

ఆర్టీసీ బస్సుల్లో ఆషాఢం రాయితీ

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం స్లాక్ సీజన్ సందర్భంగా కాకినాడ డిపోలోని ఏసీ సర్వీసులకు టికెట్ ధరలో 10 శాతం రాయితీ ఇస్తున్నట్టు మేనేజరు ఎంయూవీ మనోహర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 నుంచి జూలై 26 వరకు ఈ అవకాశం ఉంటుందన్నారు.
కాకినాడ-బీహెచ్‌ఈఎల్ రాత్రి 7 గంటలకు
నైట్ రైడర్ సర్వీసు (సీటు)
టికెట్ ధర రూ.1,350. రాయితీ ధర రూ.1,230,
బెర్త్ రూ.1,560. రాయితీ ధర రూ.1,420.
రాత్రి 8 గంటలకు కాకినాడ-బీహెచ్‌ఈఎల్
వెన్నెల సర్వీసు
టికెట్ ధర రూ.1,720. రాయితీ ధర రూ.1,560.
రాత్రి 9గంటలకు కాకినాడ-బీహెచ్‌ఈఎల్
అమరావతి సర్వీసు
టికెట్ ధర రూ.1,500. రాయితీ ధర రూ.1360
సాయంత్రం 5గంటలకు కాకినాడ-కర్నూలు
ఇంద్ర సర్వీసు
టికెట్ ధర రూ.1,290 రాయితీ ధర రూ.1,180.
సాయంత్రం 6 గంటలకు కాకినాడ-తిరుపతి ఇంద్ర
సర్వీసు
టికెట్ ధర రూ.1,470 రాయితీ ధర రూ.1,340.
మధ్యాహ్నం 2.45 గంటలకు కాకినాడ-బెంగళూరు
అమరావతి సర్వీసు
టికెట్ ధర రూ.2,570 రాయితీ ధర రూ.2,100.

జీజీహెచ్‌లో ప్రత్యేక వార్డు ఏర్పాటు

జీజీహెచ్ (కాకినాడ), జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అరుదైన వ్యాధులైన హిమోఫీ లియా, తలసీమియా, సికిల్‌సెల్‌లతో ప్రాణాపాయంలో ఉన్నవారికి త్వరితగతిన చికిత్స అందించేందుకు కాకినాడ జీజీహెచ్‌లో ఐదు పడకల సామర్థ్యంతో ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేసినట్టు సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి తెలిపారు. శుక్రవారం ఆమె అన్ని వార్డులను పర్యవేక్షించి రోగులను వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శ్రీనివాసన్, అడ్మినిస్ట్రేటర్ శ్రీధర్, డీసీఎస్‌ఆర్ ఎంవో డాక్టర్ మెహర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

తాళ్లరేవు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కోరింగ పంచాయతీ సీతారామపురం వివేకానంద ఈడీసీ కమిటీని 15 మంది సభ్యులతో టేకుమూడి లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్టు ఫారెస్ట్ అధికారి ధనంజయ శుక్రవారం తెలిపారు. గ్రామ పెద్దలు, ప్రజలు, ఫారెస్ట్ అధికారులు పాల్గొన్నారు.


పెద్దాపురం నియోజకవర్గస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చినరాజప్ప

‘ప్రభుత్వ పథకాల అమలుపై ప్రచారం చేయాలి’

సామర్లకోట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు ద్వారా ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ఇంటింటా విస్తృత ప్రచారం చేయాలని కార్యకర్తలను ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కోరారు. శుక్రవారం ఆయన అచ్చంపేటలోని తన స్వగృహంలో పెద్దాపురం నియోజకవర్గ స్థాయి గ్రీవెన్స్ సమావేశం నిర్వహించారు. పరిశీలకుడు బొల్లా వెంకటరమణ పార్టీ నిర్దేశించిన కార్యా చరణ ప్రణాళికలను కార్యకర్తలకు వివరించారు. నాయకులు రాజా సూరిబాబురాజు, తోటకూర శ్రీనివాసు, మునిరెడ్డి శ్రీరాములు, రాంబాబు, ఎలిశెట్టి నాని, కందుల విశ్వేశ్వరరావు, చీకట్ల వెంకటేష్, తాతపూడి కృష్ణబాబు పాల్గొన్నారు.

తప్పు చేసిన వారెవరైనా చట్టం ముందు సమానులేనని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప స్పష్టం చేశారు. మండలంలోని అచ్చంపేటలో గల తన స్వగృహంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో ఆ పార్టీ నాయకులు చేసిన అక్రమాలు, దౌర్జన్యాలపై పోలీసులు తమ పని చేసుకుపోతుంటే డ్రామాలాడుతున్నారని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఆరోపించడం చూస్తుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందన్నారు. అప్పట్లో తమ నాయకుడు చంద్రబాబునాయుడును, టీడీపీ నాయకులను వేధించి ఇబ్బందులకు గురి చేయడమే గాక అక్రమంగా కేసులు బనాయించి అరెస్టు చేసిన విషయం వైసీపీ నాయకులకు గుర్తు లేదా ప్రశ్నించారు.

అక్టోబరులో స్వర్ణోత్సవ సావనీర్ ఆవిష్కరణ


ఎంపీకి స్వర్ణోత్సవ సావనీర్ ప్రతిని చూపిస్తున్న అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధులు

కాకినాడ సిటీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పుచ్చా వీవీ శాస్త్రి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు కె.పద్మనాభం... శుక్రవారం రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబును సామర్లకోట మండలం కొప్పవరంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రతినెలా మాదిరి వచ్చే నెల 5న జరిగే రిటైర్డ్ ఎంప్లాయీస్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని కోరారు. అసోసియేషన్ స్థాపించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా అక్టోబరు నెలలో స్వర్ణోత్సవ సావనీర్‌ను ఆవిష్కరించాలని కోరారు. స్వర్ణోత్సవ సావనీర్ ప్రతిని ఎంపీకి చూపించగా ఆవిష్కరణకు తప్పక వస్తానని ఆయన తెలిపారు. ఎంపీ క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి మేకా లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.


పెద్దాపురం మండల పరిషత్ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న కార్యదర్శులు

సమస్యల పరిష్కారానికి పంచాయతీ కార్యదర్శుల వినతి

పెద్దాపురం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం ఎంపీడీవో కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలను కలెక్టర్‌కు వివరించేందుకు శనివారం సామూహిక సెలవు మంజూరు చేయాలని సూపరింటెండెంట్ సత్యనారాయణమూర్తికి వినతిపత్రం అందజేశారు. కార్యదర్శులు రమణ, సత్యనారాయణమూర్తి, సుభాని, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: పని భారాన్ని నిరసిస్తూ శనివారం విధులకు హాజరుకామని మండలంలోని 17 పంచాయతీల కార్యదర్శులు ఎంపీడీవో సత్యనారాయణకు తేల్చి చెప్పారు. సీనియర్ కార్యదర్శి వీజేవీ రమణ మాట్లాడుతూ అధికారుల నిరంకుశత్వాన్ని నిరసిస్తూ శనివారం మాస్ క్యాజువల్ లీవ్ పెడుతున్నామన్నారు.

30న జాబ్‌మేళా

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 30వ తేదీ ఉదయం పది గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారి ఇ.వసంతలక్ష్మి తెలిపారు. కృష్ణ ప్రభాస్ పేపర్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్, ఎస్‌బీఐ గ్రూప్స్ వంటి ప్రముఖ కంపెనీలు ఇంటర్వ్యూలు జరుపుతాయన్నారు. ఆసక్తి గల పురుషులు, మహిళలు బయోడేటా, సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో జిల్లా ఉపాధి కార్యాలయానికి హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 8639846568ను సంప్రదించాలని కోరారు.



మరిడమ్మకు స్వర్ణ పుష్పార్చన

పెద్దాపురం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మరిడమ్మ అమ్మవారిని శుక్రవారం మండపంలోని ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ బంగారు, వెండి పుష్పాలతో ప్రత్యేక పూజలు జరిపారు. దర్శనానికి వచ్చిన భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. దేవస్థానం సహాయ కమిషనరు కురం విజయలక్ష్మి, సిబ్బంది రమణ, ఆసాదులు పాల్గొన్నారు. ఆలయంలో జరిగిన సామూహిక కుంకుమ పూజల్లో సుమారు వంద మంది మహిళలు పాల్గొన్నారు.

నీటి తీరువా పన్ను చెల్లించాలి

పిఠాపురం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంతో పాటు మండలంలోని గ్రామాల్లో ప్రస్తుత ఫసలీ 1434కు రైతులు నీటి తీరువా పన్నుగా రూ.78.93లక్షలు చెల్లించాల్సి ఉందని తహసీల్దారు వీవీ గోపాలకృష్ణ తెలిపారు. డిమాండ్ రూ. 79.95 లక్షలు ఉండగా రైతులు ఇప్పటివరకు కేవలం రూ.1.02 లక్షలు మాత్రమే చెల్లించారని, సకాలంలో కట్టి సహకరించాలని కోరారు. నీటి తీరువా పన్ను డిమాండ్, ఇతర వివరాల కోసం సచివాలయాల్లో వీఆర్వోలను సంప్రదించాలని సూచించారు.

చేబ్రోలులో నట్టల నివారణ శిబిరం

గొల్లప్రోలు రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు పశు వైద్యశాల వద్ద శుక్రవారం నట్టల నివారణ శిబిరం నిర్వహించారు. వెయ్యికి పైగా మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందు వేసినట్టు మండల పశువైద్యాధికారి డాక్టర్ ప్రశాంత్ తెలిపారు. మండలంలో 12వేల డోసుల మందు పంపిణీకి సిద్ధంగా ఉందని, జూలై 10 వరకు ప్రత్యేక శిబిరాలు కొనసాగుతాయని చెప్పారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, పశు వైద్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కార్యదర్శులపై పనిభారం తగ్గించండి

ప్రత్తిపాడు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): పని భారం పెరిగిందని, ప్రభుత్వం వెంటనే పనిభారం తగ్గించాలని ప్రత్తిపాడులో పెద్దాపురం డీఎల్‌పీవో బాలామణి, ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబుకు శుక్రవారం గ్రామకార్యదర్శులు వినతిపత్రాలు అందజేశారు. పించన్ల పంపిణీ, తదితర పనుల పనిభారంతో కార్యదర్శులు సతమతమవుతున్నారని తెలిపారు. కార్యదర్శులు జ్యోతుల పద్మరాజు, సీహెచ్ వేణుగోపాల్, వి.వీరబాబు, ఎం.లక్ష్మీనారాయణ, రమణ తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

వరద విపత్తుని ఎదుర్కోవాలి

- ప్రతి అధికారి అప్రమత్తంగా ఉండాలి
- వరద సమీక్షలో సూచనలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్



వరదపై సమీక్షిస్తున్న అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

చింతూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వరద విపత్తుని ఎదుర్కొనేందుకు ప్రతి అధికారి, విధులు నిర్వహణ అప్పగించిన ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని అల్లూరి సీతారామరాజుజిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం చింతూరు ఐటీడీఏ సమావేశ మందిరంలో కలెక్టర్ వరద సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా చింతూరు డివిజన్‌స్థాయి అధికారులకు, ఉద్యోగులకు కలెక్టర్ పలు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు.వరద ప్రభావాలపై అనుభవం ఉన్న ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల నుంచి కూడా సూచనలు సలహాలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. వరద ప్రభావిత బాధితులకు ముందుగానే రెండు నెలల రేషన్‌సరఫరా చేయాలన్నారు. వరద సంభవించిన క్రమంలో తీసుకోవాల్సిన ప్రతిచర్యను ముందస్తుగానే ప్రణాళిక చేసుకోవాల్సి ఉందన్నారు. గతంలో వచ్చిన వరదలను దృష్టిలో ఉంచుకొని ఆ మేరకు అవసరమగు చర్యలు తీసుకోవాలన్నారు. నాటు పడవలు, లాంచీలు సిద్ధం చేసుకోవాల్సి ఉందన్నారు. తాగు నీరు, వసతి కోసం పునరావాస కేంద్రాల ఏర్పాటు ఆయా ప్రాంతాలలో సోలార్‌ద్వారా వెలుతురునివ్వడం లాంటి చర్యలు తీసుకోవా లన్నారు. వరద ప్రభావంపై ఎప్పటికప్పుడు ముంపు గ్రామాలకు విధిగా సమాచారం ఇవ్వాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్, రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, చింతూరు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా, వివిధశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా పైపులైన్లలో తాగునీరు



పురుగులతో ఉన్న నీరు

మోతుగూడెం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మోతుగూడెంలో లోయర్ సీలేరు ఏపీ జెన్కో పైప్‌లైన్ నుంచి వస్తున్న నీటిలో నాణ్యత ఉండడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గణేష్ టెంపుల్ వీధిలో జెన్‌కో పైపు లైన్ ద్వారా వచ్చిన నీళ్లలో అనేక జలచరాలు వస్తున్నాయి. వర్షాకాలం ప్రారంభంలోనే ఈ రక మైన నీటిని పైప్‌లైన్‌లలో సరఫరా చేస్తే రానున్న రోజుల్లో ఏ రకమైన నీరు విడుదలచేస్తారు అని గ్రామస్థులు భయపడుతున్నారు. ప్రజలు ఈ నీటిని తాగటానికి వంటలకు, ఇతర నిత్యావసరాలకు ఉపయోగిస్తూ ఉంటారు. ఈ రకమైన నీటిని ఉపయోగిస్తే అనారోగ్యం పాలవుతామని ప్రజలు భయపడుఇ తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

- ఉపాధి సిబ్బందితో సమీక్షలో ఎంపీడీవో బాపన్నదొర



ఉపాధి హామీ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో బాపన్నదొర

వై.రామవరం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): స్థానిక ఉపాధి హామీ సిబ్బందితో శుక్రవారం ఎంపీడీవో బాపన్నదొర అత్యవసర సమావేశమయ్యారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఉపాధి పనుల నిర్వహణపై సిబ్బందితో సమీక్షించారు. కూలీల సంఖ్య పెంచాలని వ్యవసాయ చెరువు నిర్మాణాలు వేగవంతంగా పూర్తిచేయాలని, అలాగే ఉద్యానవన రైతులను గుర్తించి సంబంధించిన ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. కొత్త పనులను గుర్తించాలని, కంపోస్ట్ పిట్స్ పూర్తిచేయాలని తదితర అంశాలపై సూచనలు చేశారు.

చింతూరు ఎంపీడీవోగా శ్రీనివాసరావు దొర



చింతూరు ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావుకు పుష్ప గుచ్ఛం అందించి స్వాగతిస్తున్న పంచాయతీరాజ్ అధికారులు

చింతూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): చింతూరు ఎంపీడీవోగా శ్రీనివాసరావు దొర నియమితులయ్యారు. శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. శ్రీనివాసరావు దొరకు ఈవో, పీఆర్‌డీవో గుంపెనపల్లి మోహనరావు, చింతూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ తదితరులు పుష్పగుచ్ఛం అందించి ఆహ్వానం పలికారు. శ్రీనివాసరావుదొర ఇప్పటివరకు రంపచోడవరం ఎంపీడీవోగా విధులు నిర్వర్తించారు.

సోకులగూడెంలో పీసా గ్రామసభ

రంపచోడవరం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోకులగూడెంలో శుక్రవారం సర్పంచ్ కొమరం పండుదొర ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామాలలో అభివృద్ధి పనులను పీసా కమిటీలు గుర్తించి ప్రభుత్వానికి నివేదించడం జరుగుతోందని తద్వారా ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు చేరతాయన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో జయంతి, టీడీపీ మండలాధ్యక్షుడు కారం సురేష్‌బాబు, ఎంపీటీసీ సభ్యుడు నర్రి పాపారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'ఉద్యోగ భద్రత కల్పించాలి'

దేవీపట్నం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ భద్రత, సర్వీసు న్యాయం, ప్రమోషన్ హక్కుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని గ్రామసర్వేయర్లు తహసీల్దార్ కె.సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. తమ డిమాండ్లు తక్షణమే పరిష్కరించాలన్నారు. తమను పట్టించుకోకపోతే ఉద్యమాలు చేయాల్సి వస్తోందని హెచ్చరించారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

- ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ
- పలు చోట్ల విద్యామిత్ర కిట్ల పంపిణీ

ఏలేశ్వరం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. యర్రవరంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ విద్యామిత్ర కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. అలాగే యర్రవరంలో 8వతరగతి వరకు ఉన్న పాఠశాలలో 9,10 తరగతులకు విద్యా శాఖ అనుమతి ఇవ్వడంతో శుక్రవారం అదనపు తరగతులను ఎమ్మెల్యే ప్రారంభించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లు, పుస్తకాలు, బూట్లు, టై, బెల్టులు అందజేశారు. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, జడ్పీటీసీ సభ్యులు నీరుకొండ రామకుమారి, బస్వప్రసాద్, షైరాల కనకారావు, మేడిశెట్టి సూర్యకిరణ్, గంగిరెడ్ల మణికంఠ పాల్గొన్నారు.



ఏలేశ్వరం: యర్రవరంలో విద్యామిత్ర కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

కిర్లంపూడి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమవరం హైస్కూల్‌లో హెచ్ఎం మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యాకమిటీ చైర్మన్ పి.వీరబాబు అధ్యక్షతన 230మంది విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లను మాజీ సర్పంచ్ జంపన సీతారామచంద్ర వర్మ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సూతి శ్రీను, గంగిరెడ్డి దొరబాబు, మంచికంటి శ్రీను, జ్యోతుల కోటి తదితరులు పాల్గొన్నారు.

రౌతులపూడి,(ఆంధ్రజ్యోతి): రౌతులపూడి, జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర కిట్లను విద్యార్థులకు కూటమి నేతలు అందజేశారు. పాఠశాల చైర్మన్ షేక్ సలీమ్ ఆధ్వర్యంలో ఎంపీపీ గంటిమళ్ల రాజ్యాలక్ష్మి, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్య భాస్కరరావు, వెలమ కార్పొ రేషన్ డైరెక్టర్ పైల సాంబశివరావు కిట్లను అందజే శారు. ప్రధానోపాధ్యాయుడు కోళ్ల రాంబాబు, ఆసుపత్రి డైరక్టర్ బండారు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

శంఖవరం, (ఆంధ్రజ్యోతి): నెల్లిపూడి ప్రభుత్వ పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణవిద్యామిత్ర కిట్లను విద్యార్థులకు ప్రత్తిపాడు మార్కెట్ యార్డు చైర్మెన్ బద్ది మణిరామారావు అందించారు. టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బద్ది రామకృష్ణ, సీహెచ్ విజయకుమార్, అరిగెల జగదీష్, హెచ్ఎం రాంబాబు పాల్గొన్నారు.

మల్లిశాల ఫిషర్‌మెన్ సొసైటీ చైర్మన్‌గా రాజు



చైర్మన్‌కు పూలమాలవేసి అభినందనలు తెలుపుతున్న జ్యోతుల నవీన్

జగ్గంపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మల్లిశాల ఫిషర్‌మెన్ సొసైటీ చైర్మన్ ఎన్నికల్లో చైర్మన్‌గా గ్రామానికి చెందిన ఇంజరపు రాజును, సెక్రటరీగా లింకల భీమరాజును బోర్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జగ్గంపేట టీడీపీ కార్యాలయంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌ను సొసైటీ చైర్మన్ రాజు, సెక్రటరీ భీమరాజు సంఘ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వారందరినీ శాలువాలు, పూలమాలతో సత్కరించారు. చైర్మన్ రాజు మాట్లాడుతూ చైర్మన్‌గా ఎన్నుకున్న సంఘ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, జీను మణిబాబు, పైడిపాల సూరిబాబు, బుర్రి సత్తిబాబు, సర్వసిద్ధి లక్ష్మణరావు, తొట్టిపూడి నాగేశ్వరరావు, పల్లికొండ భద్రం, ఇంజరపు దుర్గబాబు, బస్వా చినబాబు పాల్గొన్నారు.

'నిబంధనలు పాటించడం లేదు'

ప్రత్తిపాడు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ప్రాంతంలోని ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదని ఎస్ఎఫ్ఐ నాయకులు విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. నిరుపేదలకు ప్రైవేట్ పాఠశాలల్లో అడ్మిషన్లు ఇవ్వాలనే నిబంధన తుంగలో తొక్కుతున్నారని, అర్హులైన విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలల్లో అడ్మిషన్లు ఇవ్వడం లేదని దీనిపై చర్యలు తీసుకోవాలని మండల ఎస్ఎఫ్ఐ నాయకుడు మణికంఠ నరసింహమూర్తి స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

వైసీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శిగా రాజేశ్వరి

ప్రత్తిపాడు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శిగా ప్రత్తిపాడు జడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి నియమితులయ్యారు. ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శుక్రవారం నియామకపు ఆదేశాలు అందాయి.

గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలి: ఎంపీడీవో



సంపద కేంద్రాన్ని తనిఖీ చేసి పంచాయతీ అధికారులకు ఆదేశాలు ఇస్తున్న ఎంపీడీవో

ప్రత్తిపాడు, జూన్ 27(ఆంధ్రజ్యోతి): వర్షాలు ప్రారంభమైన తరుణంలో గ్రామాలు పరిశుభ్రంగా ఉండేందుకు పంచాయతీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్ బాబు కోరారు. ధర్మవరం గ్రామ పంచాయతీని శుక్రవారం డిప్యూటీ ఎంపీడీవో కాశీవిశ్వనాధ్, సర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయితో కలిసి సందర్శించారు. గ్రామంలోని మురికినీటి కాలువల్లో చెత్త తొలగింపు, పంచాయతీ పరిధిలోని చెత్తను ట్రాక్టర్లపై డంపింగ్ యార్డుకు తరలింపు పనులను ఎంపీడీవో పరిశీలించారు. సంపద కేంద్రాన్ని సందర్శించి వర్మీకంపోస్టును రైతులకు, మొక్కల పెంపకందారులకు సరఫరా చేయాలని నిర్వాహకులకు సూచించారు. గ్రామాల్లో వర్షాల కారణంగా అంటు వ్యాధులు ప్రబలకుండా శానిటేషన్, క్లోరినేషన్ పనులు నిర్వహించాలని ఆదేశించారు. నూకాలమ్మ ఆలయం గుడి ప్రాంతంలో తాగునీరు సరఫరాలో తరుచూ అవాంతరాలు ఏర్పడుతున్నాయని, హ్యాండ్‌బోర్లు ఏర్పాటు చేయాలని బీజేపీ మండలా ధ్యక్షుడు ఊటా వీరబాబు, వార్డు మెంబర్ గొనగాల గోపాలస్వామి కోరారు. వారం రోజుల్లో చేతిపంపులు ఏర్పాటు చేస్తామని ఎంపీడీవో హామీ ఇచ్చారు. కార్యదర్శులు చెల్లుబోయిన వేణుగోపాల్, తేజా ప్రతాప్, సిబ్బంది ఖండవిల్లి సూరిబాబు, అర్జున్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టండి



మాట్లాడుతున్న డీఎల్‌పీవో బాలామణి

కిర్లంపూడి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని డివిజనల్ పంచాయతీ అధికారి బాలామణి అన్నారు. శుక్రవారం ఆమె ముక్కొల్లు గ్రామంలో ప్రతీ ఇంటి నుంచి చెత్త సేకరణ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం కిర్లంపూడి మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రుతుపవనాలు ప్రవేశించినందున గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహించాలన్నారు. మంచినీటి వనరులు సురక్షితంగా ఉండేలా చూడాలని, లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవో హరికృష్ణ, సత్యప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కోడికత్తులు కట్టే వ్యక్తిపై కేసు

కిర్లంపూడి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గోనేడకు చెందిన కేఆర్‌బాబు కోడిపందేల్లో పుంజులకు కత్తులు కడుతున్నాడు. శుక్రవారం అతడిపై తహశీల్దార్ ఎదుట హాజరుపరిచారు. సత్‌ప్రవర్తన కోసం బైండోవర్ చేశారు.

జగ్గంపేట వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడిగా శ్రీనివాస్



జ్యోతుల నవీన్‌ను కలిసిన శ్రీనివాస్

జగ్గంపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడిగా గరిమెళ్ళ శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం రావులమ్మనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్తవెంకటేశ్వరరావు, గండేపల్లి, జగ్గంపేట మండల వ్యవసాయ శాఖ అధికారులు రెడ్డి శ్రీరామ్, నరసింహం తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్ ఏవోగా మూర్తి



అధికారులకు నియామక ఉత్తర్వులు అందజేస్తున్న మూర్తి

ప్రత్తిపాడు, జూన్27(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మండలం పరిషత్ ఏవోగా ఆకొండి మూర్తి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ పదోన్నతిపై మూర్తి ఏవోగా బాధ్యతలు చేపట్టారు. మూర్తిని ఎంపీపీ గోళ్ళ కాంతి సుధాకర్, ఎంపీడీవో కుమార్‌బాబు, డిప్యూటీ ఎంపీ డీవో కాశీ విశ్వనాథ్, మండల ఇంజనీరింగ్ అధికారి సత్యప్రకాష్, ఎంఈవో వి.రాజబాబు, జూనియర్ అసిస్టెంట్ సురేష్, మం డల కార్యదర్శులు, సర్పంచ్‌లు అభినందించారు.

రైతులకు విత్తనాల అందజేత



విత్తనాలు అందజేస్తున్న కూటమి నేతలు

రౌతులపూడి, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రాజవరం సచివాలయం వద్ద రైతులకు సబ్సిడీపై విత్తనాలను శుక్రవారం కూటమి నేతలు చింతకాయల రాజబాబు, టికేల అడి విరాజులు, పంచాడ బుజ్జి అందజేశారు. పైలరాజు, ముప్పల వెంకటేశ్వరరావు, శ్రీను వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ భద్రతపై అవగాహన ఉండాలి

తొండంగి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ భద్రత పై ప్రతి ఉద్యోగి అవగాహన కలిగి ఉండాలని దివిస్ లే బొరేటరీస్ జనరల్ మేనేజర్ నాగేశ్వర్ అన్నారు. శుక్రవారం దివిస్‌లో జరిగిన విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో ఆయన మాట్లాడారు. విద్యుత్ పరికరాలను సక్రమంగా వినియోగించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ప్రతి ఉద్యోగి భద్రతా నియమాలు పాటించాలన్నారు. ఉద్యోగులంతా భద్రతా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ సతీష్ కుమార్, విద్యుత్ అధికారి ఎస్. శివ ప్రసాద్ , తదితరులు పాల్గొన్నారు.

విజయ్‌కుమార్‌రెడ్డికి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ

గండేపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్శిటీ లాజిస్టిక్స్ విభాగంలో మేనేజర్‌గా సేవలందిస్తున్న పామూరి విజయ్‌కుమార్‌రెడ్డి శ్రీజెజెటి యూనివర్శిటీ రాజస్థాన్ నుంచి డాక్టరేట్ పొందినట్టు ఆదిత్య యూనివర్శిటీ ప్రో చాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి తెలిపారు. ఈయన్ని యూనివర్శిటీ చాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, వైస్ చాన్సలర్ ప్రో ఎంబీ శ్రీనివాస్, ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏ. రమేష్, డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, డీన్లు అభినందించారు.

ముగిసిన ఫ్యాకల్టీ ప్రోగ్రాం

వర్సిటీలో అధునాతన కమ్యూనికేషన్లు అనే అంశంపై నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ముగిసిందని డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్ షేక్ వల్లికి ఘన సత్కారం



షేక్ వల్లిని సత్కరిస్తున్న ముస్లిం మతపెద్దలు, కమిటీ సభ్యులు

జగ్గంపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రోడ్‌లోని జగ్గంపేట జామియా మసీద్ కమిటీ ఆధ్వర్యంలో జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ షేక్‌వల్లికి సత్కారం చేశారు. జిల్లా వక్ఫ్ బోర్డు కమిటీ మాజీ చైర్మన్ గఫూర్ ఆధ్వర్యంలో పూలమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జగ్గంపేట జామియా మసీదు కమిటీ ప్రెసిడెంట్ ఆరిఫ్, చిన్న కాజా, పెద్ద కాజా, ఎండీ బాషా, షేక్ సలీం, సయ్యద్ బాజీ, ఎస్‌కే రెహమాన్ పాల్గొన్నారు.

దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయాలు అనుసరణీయం : మంత్రి

తునిరూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): దివంగత దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయాలు అనుసరణీయమని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. తునిలో శుక్రవారం వెంకటరెడ్డి విగ్రహావిష్కరణ సభకు మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో తనదైన పాత్ర పోషించి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. నిరక్షరాస్యతను నిర్మూలించి, చదువు ప్రాముఖ్యతను గుర్తించి అప్పట్లోనే ప్రాథమిక పాఠశాలలు, వయోజన విద్య, గ్రంథాలయాలు, రాత్రిపూట చదువులు ప్రోత్సహించి విద్యాభివృద్ధికి కృషి చేశారన్నారు. టీడీపీ సీనియర్ నేత, పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ వెంకటరెడ్డి గొప్ప సంఘసంస్కర్త అని, జీవించి ఉన్నంతకాలం ఎన్నో సామాజిక సేవలు చేశారని కీర్తించారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డైరెక్టర్ కడలి ఈశ్వరి, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, చొల్లంగి వేణుగోపాల్, చొల్లంగి వెంకటరమణ, చినబాబు, బీసీ సంఘం నేతలు పాల్గొన్నారు. దొమ్మేటి విగ్రహాన్ని మంత్రి చేతులమీదుగా ఆవిష్కరించారు. మంత్రిని బీసీ సంఘం నేతలు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.



వెంకటరెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మంత్రి సుభాష్, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు

'అలసత్వం వహిస్తే కఠిన చర్యలు'



సచివాలయ ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీడీవో

తొండంగి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉంటూ సకాలంలో హాజరుకాని బెండపూడి 1, 2, సచివాలయ ఉద్యోగుల తీరుపై తొండంగి ఎంపీడీవో రాజేశ్వరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయ ఉద్యోగులు విధులకు సకాలంలో హాజరుకావడం లేదని, ఎప్పుడు వస్తున్నారో, ఎప్పుడు వెళ్తున్నారో తెలియని పరిస్థితి ఉందంటూ ప్రజల నుంచి ఎంపీడీవోకు ఫిర్యాదులు అందాయి. దీనిపై స్పందించిన ఆయన రెండు సచివాలయాల్లో పనిచేస్తున్న 14 మంది ఉద్యోగుల గత వారం రోజుల హాజరును పరిశీలించారు. సచివాలయ ప్రారంభ సమయమైన పది గంటలకు అతికొద్ది మాత్రమే హాజరవుతన్నారని, మిగిలిన వారంతా ఇష్టం వచ్చిన సమయంలో హాజరవుతున్నట్టు గమనించారు. దీంతో ఆగ్రహించిన ఆయన సచివాలయ సిబ్బందిని శుక్రవారం తన కార్యాలయానికి పిలిపించారు. ఉద్యోగ బాధ్యతల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రజలకు సేవలందించడంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈయనతోపాటు అధికారులు ఉన్నారు.

కష్టపడే వారికి టీడీపీలో గుర్తింపు : యనమల



వెంకటకృష్ణారావును అభినందిస్తున్న యనమల, తదితరులు

తుని రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కష్టపడి పని చేసే వారికి టీడీపీలో గుర్తింపు ఉంటుందని మాజీమంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. కోటనందూరు మండలానికి చెందిన టీడీపీ నాయకుడు వెలగా వెంకట కృష్ణారావు నర్సీపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం తేటగుంట టీడీపీ క్యాంప్ కార్యాలయంలో యనమలను కలిశారు. వెంకటకృష్ణారావును అభినందిస్తూ రైతు శ్రేయస్సే లక్ష్యంగా పని చేయాలని తెలిపారు. ఆయన వెంట సుర్ల లోవరాజు, చింతమనీడి అబ్బాయి, మోతుకూరి వెంకటేష్, యినిగంటి సత్యనారాయణ, మళ్ల గణేష్, తమరాన సత్యనారాయణ, సుర్ల బోడయ్య, గంట్ల సత్యనారాయణ ఉన్నారు.

చర్చి నూతన మందిరం ప్రారంభం



రిబ్బన్ కట్ చేస్తున్న నవీన్

జగ్గంపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మెయిన్ రోడ్డులోని దేవి సెంటర్లో గల సెయింట్ పాల్స్ లూథరన్ చర్చి పేరిష్ నూతన మందిరాన్ని జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ప్రారంభించారు. చర్చి సంఘ సభ్యులు, చిన్నారులు, దైవజనులు పాల్గొన్నారు.

'ధాన్యం సొమ్ములు చెల్లించాలి'

ప్రత్తిపాడు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి ప్రభుత్వం వెంటనే నగదు చెల్లించాలని భారతీయ కిసాన్ సంఘం జిల్లా అధ్యక్షుడు రాసంశెట్టి రాజా, రాష్ట్ర సంఘటనా కార్యదర్శి కొండబాబు డిమాండ్ చేశారు. ప్రత్తిపాడులో శుక్రవారం నిర్వహించిన భారతీయ కిసాన్ సంఘం జిల్లా సమావేశంలో వారు మాట్లాడుతూ బకాయిలు చెల్లించక పోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లా నాయకులు నీలగిరి చిట్టిబాబు, కంపరపు నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ఇరిగేషన్ కాలువలు అన్ని ఆధునీకరణ పనులు చేపట్టి ఖరీఫ్‌లో సాగునీటి కొరత లేకుండా చేయాలన్నారు. బీకేఎస్ నేతలు యల్లపు సూర్యనారాయణ, ఆకుల హరిబాబు, మారిన రామసాయి, కాకిలేటి వీర్రాజు పాల్గొన్నారు. ధాన్యం బకాయిల విడుదలకు చర్యలు తీసుకోవాలని కోరుతూ తహశీల్దార్ సూర్యప్రభకు వినతిపత్రం అందజేశారు.

'ఎస్సీ వర్గీకరణను వెంటనే నిలిపివేయాలి'

తుని రూరల్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో హడావిడిగా ప్రారంభించిన ఎస్సీ వర్గీకరణను వెంటనే నిలిపి వేయాలని మాల మహానాడు నేషనల్ ప్రెసిడెంట్ ఆర్ఎస్ రత్నాకర్ డిమాండ్ చేశారు. తునిలో ఆయన మీడియాతో మాట్లాడారు.

జ్యోతుల నవీన్ పరామర్శ



సత్యనారాయణ కుటుంబ సభ్యులతో జ్యోతుల నవీన్‌కుమార్

జగ్గంపేట రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లిశాలకు చెందిన టీడీపీ జగ్గంపేట మాజీ మండలాధ్యక్షుడు, సీనియర్ టీడీపీ నాయకులు పైడిపాల సత్యనారాయణ భార్య శేషయ్యమ్మ ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ శేషయ్యమ్మ పరామర్శించి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. జీను మణిబాబు, కొత్త కొండబాబు, పైడిపాల సూరిబాబు, సర్వసిద్ధి లక్ష్మణరావు, వేములకొండ జోగారావు, బస్వా చిన్నబాబు ఉన్నారు.

గండేపల్లి, మురారిలో 'ఫ్రైడే డ్రైడే'



మురారిలో తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో

గండేపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గండేపల్లి, మురా రిలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో కె.చంద్రరావు డోర్ టు డోర్ తిరిగి తడి, పొడి చెత్త సేకరణ, వాటర్ ట్యాంక్ క్లోరినేషన్ నిర్వాహణపై అవగాహన కల్పించారు. వర్షాల నేపథ్యంలో పారిశుధ్య నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.